అనుదినం జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
సోమవారం 20 ఫిబ్రవరి 2023

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలోని రామ్‌సింగ్ తండా గ్రామానికి చెందిన చవాన్ ఇనేష్ ఇల్లు ఇటీవల విద్యుత్ తీగలు తగిలి కాలిపోయింది. విషయాన్ని తెలుసుకున్న జడ్పీటీసీ రాజేశ్వర్‌రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. సంఘటనకు కారణాలను అడిగి తెలుసుకున్నారు అనంతరం బాధిత కుటుంబా సభ్యులకు రూ.5వేల ఆర్థిక సాయాన్ని అందజేసి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట మాజీ అడెల్లి పోచమ్మ చైర్మన్ రాజేశ్వర్, మాజీ ఎంపీటీసీ రాజలింగం, గవాస్కర్, బద్రి నారాయణ నాయక్, నారాయణ, రాము, జాదవ్ సంతోష్, సోమన్న, శ్రీనివాస్ ఉన్నారు.



తృటిలో ప్రాణాలతో బయటపడ్డ బాలుడు

నవతెలంగాణ-ఇచ్చోడ

మండల కేంద్రంలోని అటవీశాఖ కార్యాలయం సమీపంలో బస్సు కిందకు వెళ్లిన బాలుడు తృటిలో ప్రాణాలతో బయటపడ్డాడు. ఆదివారం ఇస్లాంపుర కాలనీకి చెందిన శబ్రోజు (15) ద్విచక్రవాహనం మీద వెళ్తున్నాడు. ఫారెస్ట్ ఆఫీస్ ముందు రోడ్డు గుంతలమయంగా ఉండడంతో తప్పించబోయి వేగంగా వస్తున్న బస్ కిందకు వెళ్లాడు. తలకు తీవ్ర గాయాలు కాగా రిమ్స్‌కు తరలించారు.



పిప్పల్‌కోటి..పరిహారం ఏపాటి..?

- పరిహారం తగ్గింపుపై అన్నదాతల్లో ఆక్రోషం
- భూములు వదులుకునే ప్రసక్తే లేదని స్పష్టం
- రిజర్వాయర్ వద్దనే నిరసన దీక్షకు దిగిన రైతులు

పిప్పల్‌కోటి జలాశయ నిర్మాణం కోసం ప్రభుత్వం చేపట్టిన భూసేకరణతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారుతోంది. ప్రభుత్వం ఆనాటి ఒప్పందం ప్రకారం కాకుండా మరింత తగ్గించి పరిహారం అందజేస్తామని చెబుతుండటంతో భూ నిర్వాసిత రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అప్పటి ఇప్పటికీ భూముల ధరలు విపరీతంగా పెరిగాయని.. అగ్రిమెంట్ ప్రకారం ఎకరానికి రూ.8లక్షలు ఇచ్చినా భూములు ఇచ్చే ప్రసక్తే లేదని చెబుతున్నారు. ప్రభుత్వం అందించే ఈ అరకొర పరిహారంతో ఇతర చోట భూమి కొనుగోలు చేయలేని పరిస్థితి వాపోతున్నారు. ఎకరానికి రూ.20లక్షలు అందజేస్తేనే భూములు అప్పగిస్తామని స్పష్టం చేస్తున్నారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ గ్రామంలోని నిర్వాసిత రైతులంతా రిజర్వాయర్ నిర్మాణ పనుల వద్దనే టెంట్ వేసుకొని నిరసన తెలుపుతున్నారు. ప్రభుత్వం దిగొచ్చేంత వరకు పోరాటం కొనసాగిస్తామని చెబుతున్నారు. వీరి పోరాటానికి సీపీఐ(ఎం), కాంగ్రెస్ పార్టీ నాయకులు మద్దతు తెలిపారు.



భీంపూర్ మండలం పిప్పల్‌కోటి గ్రామానికి చెందిన ఈయన పేరు గట్ల సంతోష్. 15 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. దీని మీదనే ఆధారపడి కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ప్రభుత్వం ఈ గ్రామంలో రిజర్వాయర్ నిర్మాణం కోసం చేపడుతున్న భూసేకరణలో భాగంగా ఉన్న భూమి మొత్తాన్ని కోల్పోవాల్సి వస్తోంది. నాలుగేండ్ల క్రితం ఇస్తానన్న పరిహారం ఇవ్వకుండా మరింత తక్కువ చేయడంతో ఆందోళన చెందుతున్నాడు. ప్రస్తుతం అగ్రిమెంట్ ప్రకారం పరిహారం ఇచ్చినా తీవ్ర నష్టం జరుగుతుందని..ప్రభుత్వం అందించే రూ.8లక్షలకు ఇతర చోట భూమి లభించని పరిస్థితి ఉందని వాపోతున్నాడు. ఎకరానికి కనీసం రూ.20లక్షలు ఇస్తేనే భూమిని అప్పగిస్తామని స్పష్టం చేస్తున్నాడు. ఆ గ్రామంలోని మిగితా 80మంది రైతుల పరిస్థితి ఇలాగే ఉంది.



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి, తాంసి

తెలంగాణ- మహారాష్ట్ర సరిహద్దున ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలం చనక-కోర్ట వద్ద ప్రభుత్వం పెన్‌గంగా నదిపై ప్రభుత్వం బ్యారేజీ నిర్మాణం చేపట్టింది. దీనికి అనుబంధంగా భీంపూర్ మండలం పిప్పల్‌కోటి శివారులో రూ.368కోట్ల అంచనా వ్యయంతో 1.423టీఎంసీల సామర్థ్యంతో మరో రిజర్వాయర్ నిర్మాణాన్ని చేపడుతోంది. చనాక-కోర్ట జలాశయానికి సమీపంలోని హత్తిఘాట్ పంప్‌హౌస్ నుంచి నీటిని ఎత్తిపోస్తూ గ్రావిటీ కాల్వల పిప్పల్‌కోటి బ్యారేజీలో నీటిని నిల్వ చేసేందుకు నిర్ణయించారు. ఈ జలాశయం కోసం 1,024 ఎకరాలు అవసరమని గుర్తించామని ఇది వరకే గ్రావిటీ కాల్వలు, ఆనకట్ట నిర్మాణానికి 187 ఎకరాల భూమిని సేకరించారు. ఈ నిర్వాసితులకు మూడేండ్ల కిందటే ఎకరానికి రూ.8లక్షల చొప్పున చెల్లించారు. మిగితా 837 ఎకరాల భూమికి 2019లో ఎకరాకు ఇదే ధర చెల్లిస్తామని అప్పటి ఉన్నతాధికారులు హామీనిచ్చారు. తాజాగా కాన్సెంట్ అవార్డుకు బదులు జనరల్ అవార్డు పేరిట 2013 భూసేకరణ చట్టం అమల్లోకి తీసుకొస్తూ రైతులకు ఎకరానికి రూ.7.08లక్షలు చెల్లిస్తామని చెబుతూ అధికారులు పనులు ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నారు. పరిహారం పెంచాల్సిందిపోయి మరింత తగ్గించి ఇవ్వడమేమిటని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

జీవనాధారంపై ఆందోళన..!

ప్రభుత్వం రిజర్వాయర్ నిర్మాణం కోసం భూసేకరణ చేపట్టడం..నాలుగేండ్ల కిందట చేసుకున్న అగ్రిమెంట్ ప్రకారం కాకుండా పరిహారం మరింత తక్కువ ఇవ్వడమేమిటని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం, అధికారుల వైఖరికి నిరసనగా వారం రోజులుగా రిజర్వాయర్ స్థలంలోనే నిరసన దీక్షకు దిగారు. ప్రస్తుతం ప్రభుత్వం అగ్రిమెంట్ ప్రకారం ఎకరానికి రూ.8లక్షలు ఇచ్చినా ప్రస్తుతం పెరిగిన ధరలకు ఏ మాత్రం సరిపోవని చెబుతున్నారు. నాలుగేండ్ల కిందట ఇదే ధరకు అంగీకరించినప్పటికీ.. ప్రస్తుతం భూముల ధరలు విపరీతంగా పెరిగాయని..ప్రభుత్వం అందించే పరిహారం డబ్బులతో ఇతర చోట భూమి కొనుగోలు చేయలేని పరిస్థితి ఉందని వాపోతున్నారు. ప్రస్తుతం ఎకరానికి కనీసం రూ.20లక్షలు అందజేస్తేనే తమ భూములు అప్పగిస్తామని స్పష్టం చేస్తున్నారు. వ్యవసాయమే జీవనాధారంగా బతుకుతున్న తమకు అన్యాయం చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు.



రూ.20లక్షలు ఇస్తేనే పనులు జరుగుతాయి : మల్లేష్, భూ నిర్వాసితుడు, పిప్పల్‌కోటి



గ్రామంలో నాకు ఐదు ఎకరాల సాగు భూమి ఉంది. రిజర్వాయర్ నిర్మాణంలో ఈ భూమి పూర్తిగా పోతుంది. ప్రభుత్వం ఎకరానికి రూ.8లక్షల చొప్పున కొనుగోలు చేస్తామని నాలుగేండ్ల కిందట హామీ ఇచ్చి అగ్రిమెంట్ చేసుకుంది. కానీ డబ్బులు ఇవ్వలేదు. ఇప్పుడు ధర తగ్గించి ఇస్తామని అంటున్నారు. ప్రస్తుతం పెరిగిన భూముల ధరల డిమాండ్ ప్రకారం రూ.20లక్షలు ఇస్తేనే కొనసాగిస్తాం.

ఆర్యవైశ్య సమాజాభివృద్ధికి కృషి



నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

ఆర్య వైశ్య సమాజ అభ్యున్నతికి తన వంతుగా పూర్తి సహాయకారాలు అందిస్తానని ఎమ్మెల్యే జోగు రామన్న భరోసా కల్పించారు. ఇటీవల పట్టణ ఆర్య వైశ్య సంఘం నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని నిర్వహించగా ఆదివారం సంఘం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులను పరిచయం చేసుకుని వారితో ముచ్చటించారు. సంఘం ప్రతినిధులు ఎమ్మెల్యే జోగు రామన్నతో పాటు డిసిసిబి చైర్మన్ అడ్డి భోజారెడ్డిని శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అన్ని కులాలకు సమ ప్రాధాన్యతను ఇస్తూ అందరి సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. ఆర్యవైశ్యులకు అండగా నిలుస్తామని, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్య వైశ్య సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొత్తవార్ రాజేశ్వర్, కొత్తవార్ హరీష్ కుమార్, సభ్యులు పాల్గొన్నారు.

దివ్యాంగుడైన చౌహన్ శ్రీనివాస్‌కు ఉద్యోగం కల్పించాలి



నవతెలంగాణ-ఉట్నూర్

ఉద్యోగం వస్తోందో లేదోనని మనస్థాపానికి గురై కలెక్టరేట్ ఎదుట ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డ దివ్యాంగుడైన శ్రీనివాస్‌కు వెంటనే ఉద్యోగ అవకాశం కల్పించాలని లంబాడ హక్కుల పోరాట సమితి జిల్లా నాయకుడు, శ్యాంనాయక్‌తండ సర్పంచ్ రాథోడ్ ధర్మ నాయక్ డిమాండ్ చేశారు. ఆదివారం ప్రెస్‌భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. మండలంలోని శ్యాంనాయక్ తండా పంచాయతీ పరిధిలోని శంకర్‌తండాకు చెందిన దివ్యాంగుడు చౌహన్ శ్రీనివాస్ ఎంప్లాయిమెంట్ అధికారికి ఉద్యోగ అవకాశం కల్పించాలని రెండు సంవత్సరాల క్రితం అర్జీ పెట్టుకున్నాడన్నాడు. ఎంప్లాయిమెంట్ అధికారి కిరణ్‌కుమార్ ఆరు నెలల క్రితం ఉద్యోగానికి లక్ష రూపాయలు తీసుకున్నట్లు ఆరోపించారు. ఇటీవల కలెక్టరేట్ ముందర బాధితుడు చౌహన్ శ్రీనివాస్ ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడని, దీనంతటికీ కారణమైన ఎంప్లాయిమెంట్ అధికారి కిరణ్ కుమార్‌పై చర్యలు తీసుకొని శ్రీనివాస్‌కు ఉద్యోగం కల్పించి, మెరుగైన వైద్యం అందించాలని కోరారు. ఎంప్లాయ్‌మెంట్ అధికారి తీసుకున్న డబ్బులు తిరిగి ఇప్పించాలని, స్పందించకుంటే గిరిజన సంఘాల ఆధ్వర్యంలో ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. విలేకరుల సమావేశంలో ప్రజాసంఘాల నాయకులు దుర్గం సుభాష్, దాస్ ఉన్నారు.

రక్తదానం..మహాదానం



నవతెలంగాణ-బోథ్

రక్తదానమే మహాదానమని నవనిర్మాణం వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు సుద్దోధన్ అన్నారు. ఆదివారం మండలంలోని సోనాల గ్రామంలో శివాజీ మహారాజ్ జయంతిని పురస్కరించుకొని నవనిర్మాణ వెల్ఫేర్ సొసైటీ, ఛత్రపతి శివాజీ మహారాజ్ యువసేన ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. రక్తదాన శిబిరంలో 40 మంది రక్తదానం చేశారు. అదిలాబాద్ రిమ్స్ బ్లడ్ బ్యాంక్ సిబ్బంది రక్తదాన దాతల నుండి రక్తాన్ని సేకరించారు. గ్రామ సర్పంచ్ సదానందంతో పాటు గ్రామ యువకులు రక్తదానం చేయడానికి ముందుకు రావడంతో గ్రామ పెద్దలు వారిని అభినందించారు. శివాజీ జయంతిని పురస్కరించుకొని గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో రైల్వే బోర్డు సభ్యుడు జీవీ రమణ, మండల కన్వీనర్ సుభాష్ సూర్య, నాయకులు రామాయి శంకర్, శివాజీ యువసేన అధ్యక్షుడు అజయ్, సభ్యులు నాగరాజు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎన్‌సీసీ పరీక్ష

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఎన్‌సీసీ క్యాడెట్‌లకు సి సర్టిఫికేట్ కోసం నిర్వహించిన పరీక్షా ప్రశాంత వాతావరణంలో కొనసాగింది. ఆదివారం పట్టణంలోని ఇందిరా ప్రియదర్శిని మైదానంలో ఎన్‌సీసీ అధికారుల పర్యవేక్షణలో పరీక్ష కొనసాగింది. 32 తెలంగాణ బెటాలియన్ పరిధిలో మొత్తం 167 మంది క్యాడేట్‌లు పరీక్షా రాయాల్సి ఉండగా అందులో అయిదుగురు గైర్హాజరయ్యారు. క్యాడేట్‌లకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పూర్తి ఏర్పాట్లు చేశారు. సిసి కెమెరాల పర్యవేక్షణలో పరీక్షలు కొనసాగగా ఉన్నతాధికారులు ఎప్పటికపుడు పరీక్షా తీరును పర్యవేక్షించారు. సర్టిఫికెట్ సాధించిన విద్యార్థులకు ప్రభుత్వ ఉద్యోగాలలో రిజర్వేషన్ వర్తిస్తుందని ఈ సందర్భంగా ఎన్‌సిసి అధికారి గాలి అశోక్ పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఒకే రోజు పరీక్షలు జరుగుతున్నాయని వెల్లడించారు. 500 మార్కులకు 250 మార్కులు సాధిస్తే ఉత్తీర్ణులు అవుతారని వివరించారు.

రేషన్ బియ్యం..అక్రమార్కుల పరం..!

- 50కిలోల బస్తా నుంచి 2కిలోలు మాయం
- నేరుగా ఎంఎల్‌ఎస్ పాయింట్లనే ఈ భాగోతం
- మిగిలిస్తున్న బియ్యం రైస్ మిల్లులకు రీసైక్లింగ్
- అధికారులు, సిబ్బంది సూత్రధారులనే అనుమానం
- దిక్కుతోచని స్థితిలో రేషన్ డీలర్లు

ప్రజా పంపిణీ వ్యవస్థలో కంచె చేను మేస్తున్న విధంగా అక్రమాలను అరికట్టాల్సిన అధికారులే అక్రమాలకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. ఎంఎల్‌ఎస్ పాయింట్ నుంచి రేషన్ షాపుల్లోకి వెళ్లే బియ్యం బస్తాలో 50 కిలోలు ఉండాల్సిన బియ్యం 48, 49 కిలోలకే పరిమితం చేసి పంపడం అక్రమాలకు నిదర్శనం. సన్న బియ్యం పంపిణీ సమయాల్లో ఇది మరింత ఎక్కువ జరుగుతుందని రేషన్ డీలర్ల వాపోతున్నారు. ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల, ఆసిఫాబాద్ ఇలా అన్ని జిల్లాల్లోని ఎంఎల్‌ఎస్ పాయింట్లలో ఈ తరహా దోపిడీ జరుగుతున్నట్లు సమాచారం. బస్తాలో తక్కువ బియ్యం వస్తున్నాయని అధికారుల దృష్టికి తీసుకెళ్ళిన జిల్లాలకు చెందిన డీలర్లకు ఒత్తిడికి గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బస్తాలు చిరిగిపోవడం, కొండ్లు వేయడం మూలంగా బస్తాలో బియ్యం తక్కువ అవుతున్నాయని అధికారులు పొంతన లేని సమాధానాలు చెబుతున్నారని పేర్కొన్నారు. వేబిడ్జిపై తూకం వేసాకే బియ్యం దుకాణాలకు చేర్చాలని డీలర్లు చేసిన డిమాండ్లను బేఖాతరు చేస్తున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

నవతెలంగాణ-దిలావర్‌పూర్

నేషనల్ ఫుడ్ సెక్యూరిటీ యాక్ట్(ఎన్‌ఎఫ్‌ఎస్‌ఎ) స్టేట్ ఆర్వోల కోటా ప్రకారం ప్రతి చౌక ధర దుకాణానికి అందించాల్సిన బియ్యం ఇతర వస్తువులు సైతం ఎమ్‌ఎల్‌ఎస్ పాయింట్ నుంచి పంపిణీ చేయాలి. దీంతోపాటు అంగన్వాడి సెంటర్లకు, ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్నం భోజన పథకానికి కూడా ఇక్కడి నుంచే సరఫరా చేయాల్సి ఉంటుంది. ప్రతి బియ్యం బస్తాకు తూకంలో ఖాళీగా ఉన్న సంచి 580 గ్రాములను పరిగణలోకి తీసుకోవాలి. ఒక రేషన్ దుకాణానికి దాదాపు 200 క్వింటాళ్ల బియ్యం పంపిణీ చేయాల్సి ఉంటుంది అనుకుంటే, 50 కిలోల చొప్పున 400 బస్తాలు పంపాలి. 400 బస్తాలు అంటే 20వేల కిలోల బియ్యంతో పాటు 400 గోనెసంచుల బరువు (580 గ్రాముల చొప్పున) 20.242 కిలోలు గౌడన్లో ఉన్న ఈపాస్ లో నమోదు చేసి, బియ్యం బస్తాలు తూకం వేసి పంపించాలి. కానీ ఎలాంటి తూకం వేయకుండా ప్రతి బస్తాకు 50 కిలోల చొప్పున లెక్క కట్టి ఆర్వో వెనుక రాసి డీలర్లకు సరుకులు పంపుతున్నారు. ఇదేం పద్ధతి అని డీలర్లు ప్రశ్నిస్తే తీసుకొచ్చే లారీ కాంట్రాక్టరే వేబ్రిడ్జి తూకం వేస్తూన్నారని అధికారులు వెళ్ళడిస్తున్నట్లుగా డీలర్లు చెబుతున్నారు. ఇలా వేబ్రిడ్జిలో తూకం వేసి పంపిన బస్తాలను డీలర్ రేషన్ డోర్ డెలివరీ చేసే ఎండీయు ఆపరేటర్లకు ఇస్తున్నారు. వారు తూకం వేసి చూడగా ఒక్కో బస్తా 48 కిలోలు, 49 కిలోల చొప్పున మాత్రమే ఉంటున్నాయి. మొత్తంగా ఒక్కో డీలర్ కు మూడు క్వింటాళ్ల నుంచి నాలుగు క్వింటాళ్ల వరకు తరుగు వస్తుంది. దుకాణాలకు చేరే బస్తాలకు రంధ్రాలు పడి కొన్ని కిలోలు, మరికొన్ని బస్తాలు బాగున్నా కిలో మేర తరుగు రావడం సివిల్ సప్లై శాఖలోని అక్రమార్కుల లీలలకు అద్దం పడుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో ఏం చేయాలో తోచక డీలర్లు దిక్కు తోచని స్థితిలో ఉన్నారు. గడిచిన ఏడాది కాలంలో ఆదిలాబాద్, మంచిర్యాల, నిర్మల్, ఆసిఫాబాద్ జిల్లాల్లోని అన్ని ఎమ్‌ఎల్‌ఎస్ పాయింట్లలో బియ్యం మాయమైతున్నట్లు ఆరోపణలు వస్తున్నా ఉన్నతాధికారులు ఈ విషయంపై దృష్టి సారించకపోవడం గమనార్హం. ఈ మొత్తం బియ్యం దందాలో జిల్లాలోని ఉన్నతాధికారులే సూత్రధారులుగా, కిందిస్థాయి సిబ్బంది పాత్రధారులుగా మారుతున్నట్లు తెలుస్తుంది.



దర్జాగా రీసైక్లింగ్‌కు రైస్ మిల్లులకు

ఒక్కో బియ్యం సంచి నుంచి కిలో నుండి రెండు కిలోల వరకు మాయం చేస్తున్న అక్రమార్కులు ఇలా జమ చేసిన బియ్యం క్వింటాల్లో కొద్ది కాగానే పాత ఆర్వోలతో మిల్లులకు చేరుస్తున్నట్లు సమాచారం. ఇలా మిల్లులకు చేరిన దొడ్డు బియ్యం కాస్త మిల్లింగ్ చేసి సన్నబియంగా మారుస్తున్నారు. ఎమ్‌ఎల్‌ఎస్ పాయింట్లలో తరుగు రూపంలో మిగిలిపోతున్న వేల క్వింటాళ్ల బియ్యాన్ని అక్రమంగా బ్లాక్ మార్కెట్లకు తరలిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఎంఎల్‌ఎస్ పాయింట్లలో పనిచేస్తున్న గోడౌన్ ఇన్చార్జులు, కిందిస్థాయి సిబ్బంది కలిసి అక్రమాలకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. గత ఏడాది కాలంలో ఎంఎల్‌ఎస్ పాయింట్ల నుంచి ఎన్నో టన్నుల రేషన్ బియ్యం మాయమైనట్లు సమాచారం. పై అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నా రాత్రికి రాత్రే వందల టన్నుల రేషన్ బియ్యం తరలిపోతుండడం గమనార్హం. ఎమ్‌ఎల్‌ఎస్ పాయింట్లలో గోడౌన్లలో పనిచేసే ఉద్యోగులను ప్రతి ఏటా బదిలీ చేయాలనే నిబంధన ఉన్నా ఏళ్ళ తరబడి వారినే కొనసాగించడం మూలంగానే ఈ దందా దర్జాగా సాగడానికి ప్రధాన కారణంగా తెలుస్తోంది.

జాతరలో రెండు గ్రామాల మధ్య ఘర్షణ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

జాతర ఉత్సవాలు రెండు గ్రామాల మధ్య చిచ్చు రేపి ఘర్షణ దారి తీశాయి. మాటల యుద్ధం కాస్త చిలికిచిలికి గాలి వానలా మారి ఇరు గ్రామాల ప్రజలు ఒకరిపై ఒకరు దాడికి దిగిన ఘటన మండలంలోని అంకోలి గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. కొన్ని సంవత్సరాలుగా శ్రీ అంకానీశ్వర స్వామి జాతర ఉత్సవాలు కొనసాగుతున్నాయి. అంకోలి గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న అంకానీశ్వర స్వామి ఆలయం వద్ద ఆనాటి నుండి నేటి వరకు అంకోలి గ్రామస్తులు జాతర ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. జాతర సందర్భంగా కబడ్డీ, వాలీబాల్ క్రీడా పోటీలు నిర్వహిస్తారు. అయితే ఈ సంవత్సరం జాతర నేపథ్యంలో కబడ్డీ పోటీలు నిర్వహించగా వాలీబాల్ క్రీడాకారులు రాకపోవడంతో నిర్వహించలేదు. పోటీలను తాము నిర్వహిస్తామని అంకాపూర్ గ్రామస్తులు పేర్కొనడంతో ఇరు గ్రామాల మధ్య ఘర్షణ నెలకొంది. ఇరు గ్రామాల ప్రజల మధ్య మాటామాట పెరిగి ఘర్షణకు దారి తీసింది. ఓ గ్రామానికి చెందిన కొందరు యువకులు కారం పొడి తీసుకొచ్చి మరో గ్రామం వ్యక్తులపై చల్లడంతో ఉద్రిక్తతకు దారి తీసింది. దీంతో ఒకరిపై ఒకరు దాడికి దిగడంతో జాతర ఉత్సవాలు కాస్త రణరంగంగా మారాయి. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో డిఎస్‌పి ఉమేందర్, సిఐలు రఘుపతి, పురుషోత్తం, ఎస్సై నాగ్‌నాథ్ ఘటన స్థలానికి చేరుకొని ఇరు గ్రామాల ప్రజలను సముదాయించారు.

ఎంపీపీపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి



నవతెలంగాణ-ఉట్నూర్

జర్నలిస్టుపై దాడి చేయడమే కాకుండా గిరిజనులను అసభ్య పదజాలంతో దూషించిన ఇచ్చోడ ఎంపీపీ నిమ్మల ప్రీతంరెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని జై ఆదివాసీ యువశక్తి జిల్లా ఉపాధ్యక్షుడు బిపిన్ కుమార్, జిల్లా నాయకులు మెస్రం ప్రకాష్, నైతం గణేష్, తొడసం శంకర్ డిమాండ్ చేశారు. ఆదివారం ప్రెస్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఏజెన్సీ ప్రాంతమైన ఇచ్చోడలో ఎంపీపీ ప్రీతంరెడ్డి అధికార పార్టీ అండదండలతో గిరిజన హక్కులు, చట్టాలను ఉల్లంఘిస్తున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. గతంలో ఆయన గిరిజనులను అసభ్య పదజాలంతో ఆత్మ గౌరవాన్ని దెబ్బ తీసే విధంగా వ్యాఖ్యానించారని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎంపీపీ హోదాలో ఉండి గిరిజనులను తిట్టడం, జర్నలిస్టుపై దాడి చేయడం సరికాదని, దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. ఎంపీపీ హోదాలో ఉండే అర్హత కోల్పోయారని, వెంటనే ఆయనపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి ఎంపీపీ పదవి నుండి తొలగించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో న్యాయ పోరాటం చేస్తామని హెచ్చరించారు.

టోర్నమెంట్ విజేతగా ఈగల్ క్రికెట్ క్లబ్



నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

పట్టణంలోని డైట్ మైదానంలో కొన్ని రోజులుగా నిర్వహిస్తున్న ఆదిలాబాద్ క్రికెట్ లీగ్ 2023(ఏసిఎల్) క్రికెట్ టోర్నమెంట్‌లో ఈగల్ క్రికెట్ క్లబ్ జట్టు విజేతగా నిలిచింది. ఆదివారం ఫైనల్ దశకు చేరుకున్న ఈగల్స్ జట్టు ఫ్రెండ్స్ జట్టుతో ఫైనల్‌లో తలపడగా ఈగల్స్ విజేతగా నిలిచింది. ఈ ముగింపు కార్యక్రమంలో ఎమ్మెల్యే జోగు రామన్న పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడాకారులు టోర్నమెంట్ల ద్వారా దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయవచ్చన్నారు. ప్రతి ఏటా జోగు ఫౌండేషన్ ద్వారా ఇలాంటి టోర్నమెంట్లు నిర్వహించి క్రీడాకారులను ప్రోత్సహించడం జరుగుతుందన్నారు. క్రీడాకారులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ అడ్డి భోజారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజానీ, మాజీ మార్కెట్ చైర్మన్ మెట్టు ప్రహ్లాద్, నాయకులు సాజిదొద్దీన్, శివకుమార్, అయూబ్, ఏసీఎల్ కమిటీ నిర్వాహకులు సయ్యద్ మోసిన్, రైజ్ అహ్మద్, షేక్ యూసుఫ్, నితిన్, ఇర్ఫాన్‌ఖాన్ పాల్గొన్నారు.

సర్పంచ్ కరుణాకర్‌రెడ్డికి సన్మానం



నవతెలంగాణ-తలమడుగు

ఝరి గ్రామ పురాతన దేవాలయంలో శివరాత్రి సందర్భంగా తలమడుగు గ్రామ సర్పంచ్ కళ్లెం కరుణాకర్‌రెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో గ్రామస్తులు మాధవ్, శివారెడ్డి, నర్సింగ్‌రావు, రామయ్య, సృజన్, శ్రీనివాస్, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రమాద అంచున తరోడా వంతెన

నవతెలంగాణ-జైనథ్



మండలంలోని తరోడ గ్రామంలో జాతీయ రహదారిపై నిర్మించిన వంతెన ప్రమాదం అంచున ఉంది. దీంతో అధికారులు రాకపోకలను నిలిపేశారు. మూడు సంవత్సరాల క్రితం అధిక వర్షాలకు వంతెనపై నుండి వరద పారింది. దీంతో వంతెన దెబ్బతింది. అవసరాల నిమిత్తం మరమ్మత్తులు చేయించారు. అంతర్రాష్ట్ర రహదారి కావడంతో భారీ వాహనాల రాకపోకలతో వంతెన కుంగి ప్రమాదకరంగా మారింది. గమనించిన స్థానికులు అధికారులకు తెలియజేయడంతో భారీ వాహనాల రాకపోకలను నిలిపేశారు.

ఘనంగా హీరాసుక జయంతి

నవతెలంగాణ-బజార్‌హత్నూర్



మండలంలోని జాతర్ల గ్రామంలో హీరాసుక జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించి జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆదివాసీ పర్దన్ సేవా సంఘం సభ్యులు నైతం మోతీరాం మాట్లాడుతూ గోండు ధర్మ గురు హీరాసుక చూపించిన పర్ధన్ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతి ఒక్కరూ కాపాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గెడం సుదాం, వడ్డీ ఉత్తం, అత్రం సుభాష్, అర్క హరిదాస్, జగాన్, నగేష్, ఆశిష్, కృష్ణ పాల్గొన్నారు.

బదిలీలు, పదోన్నతులకు ప్రభుత్వం చొరవ చూపాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

నిలిచిపోయిన ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల నిర్వహణకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపాలని టిఎస్‌యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎ వెంకట్ అన్నారు. ఆదివారం డైట్ కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ ప్రకటనతో ఉపాధ్యాయుల్లో హర్షం వ్యక్తమైందన్నారు. టిఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ బదిలీలు పదోన్నతుల్లో పాటించాల్సిన నిబంధనలపై ప్రభుత్వానికి ప్రాతినిధ్యం చేసినప్పటికీ ప్రభుత్వం వాటిని పట్టించుకోలేదన్నారు. అయితే ప్రభుత్వం ఇచ్చిన జీవోలు, షెడ్యూల్‌లో లోపాల వల్ల కోర్టు కేసులతో షెడ్యూల్ నిలిచిపోయిందని, ఇప్పటికైనా ప్రభుత్వం చొరవ చూపి ఉపాధ్యాయుల ప్రయోజనాలకు నష్టం వాటిల్లకుండా బదిలీలు, పదోన్నతులు నిర్వహించేందుకు కృషి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టిఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎ స్వామి, ప్రధాన కార్యదర్శి వి అశోక్, ఉపాధ్యక్షులు ఎ సురేఖ, టి సూర్యకుమార్, కోశాధికారి కె కిష్టన్న, జిల్లా కార్యదర్శులు కె శ్రీనివాస్, ఎ ఇస్తారి, ఇ శివన్న, సోషల్ మీడియా కన్వీనర్ కె శంకర్ ఉన్నారు.

దివ్యాంగుల నుండి దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

దివ్యాంగులు ఉపాధి నిమిత్తం పునరావాస పథకం కింద 2022-23 సంవత్సరానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి మిల్కా ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పథకంలో భాగంగా వ్యవసాయ, అనుబంధ పరిశ్రమలు, సేవారంగంలో వ్యాపారాలు ఏర్పాటు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఈ నెల 28వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

24న ఉపాధ్యాయులకు సదరం శిబిరం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల నేపథ్యంలో జిల్లాలోని ప్రభుత్వ లోకల్ బాడీ యాజమాన్య పాఠశాలల్లో విధులు నిర్వర్తిస్తున్న శారీరక వైకల్యం గల ఉపాధ్యాయులకు ఈ నెల 24న జిల్లా కేంద్రంలోని రిమ్స్‌లో సదరం శిబిరం నిర్వహిస్తున్నట్లు డీఈవో ప్రణీత ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సంబంధిత ఉపాధ్యాయులు సదరం ధ్రువీకరణ పత్రం రెన్యూవల్, నూతన ధ్రువీకరణ పత్రం అవసరమైన వారు మీ సేవా కేంద్రంలో స్లాట్ బుక్ చేసుకుని శిబిరానికి హాజరుకావాలని సూచించారు. స్లాట్ బుకింగ్ సమాచారాన్ని డీఈవో కార్యాలయంలో తెలియజేయాలని, విషయాన్ని పీహెచ్ ఉపాధ్యాయులు గమనించాలని సూచించారు.

దుమ్ములోనే ప్రయాణం..!

- ఏండ్లు గడుస్తున్నా నిర్మాణంకాని రోడ్డు
- పట్టించుకోని పాలకులు, ఉన్నతాధికారులు

నవతెలంగాణ-బజార్‌హత్నూర్



ఒకటి కాదు రెండు కాదు..ఏండ్ల తరబడి విద్యార్థులు అధ్వాన రోడ్లతో అవస్థలు పడుతూనే ఉన్నారు. రోడ్డుపైకి రావాలంటేనే దుమ్మూధూళికి జంకుతున్నారు. అసలే చలికాలం..మరోవైపు కరోనా భయం..ఇలాంటి పరిస్థితుల్లో రోడ్డుపై ప్రయాణించాలంటేనే భయం వేస్తోంది. ఒకవైపు వాహనాల రద్దీ, మరో వైపు దుమ్ముతో ఎదురుగా వస్తున్న వాహనం కన్పించని పరిస్థితి. ఇలాంటి పరిస్థితుల్లో విద్యార్థులు, వాహనదారులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని పాఠశాలకు వెళ్లాల్సి వస్తోంది. ఇచ్చోడ-బజార్‌హత్నూర్ రహదారి నుంచి పాఠశాల వరకు రోడ్డు లేక దుమూధూళిలో విద్యార్థులు పాఠశాలకు వెళ్తున్నారు. మండల కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న ఆదర్శ పాఠశాల, గిరిజన ఆశ్రమ పాఠశాలతో పాటు కొత్తపల్లి గ్రామానికి రోడ్డు లేక అటు విద్యార్థులు ఇటు గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది.

పట్టించుకోని అధికారులు

దుమ్మూధూళితో కొత్తపల్లి గ్రామస్తులతో పాటు విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. అంతేకాకుండా రోడ్డుకు ఇరువైపులా ఉన్న పంట చేన్లపై ఆ దుమ్ము చేరడంతో దిగుబడి సైతం సరిగా రావడం లేదు. ఇన్ని ఇబ్బందులు ఎదురైనా పాలకులు, ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా వాహనదారులు, ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని రోడ్డు నిర్మాణం చేపట్టాలని పలువురు కోరుతున్నారు.



పాఠశాలకు వెళ్లాలంటే భయమేస్తోంది

- సింగు మణిదీపిక, విద్యార్థిని



ఉదయం పాఠశాలకు వెళ్లే రోడ్డు దుమ్మూధూళితో ఉంటుంది. దుమ్ముతో జలుబు, దగ్గుతో అనారోగ్యానికి గురవుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. సంవత్సరాలు గడుస్తున్నా ఏఒక్క ఉన్నతాధికారి పాఠశాలకు వచ్చి మా పరిస్థితులను తెలుసుకోలేదు.

రోడ్డు నిర్మాణం చేపట్టాలి

- జడల సుచిత, విద్యార్థిని



పాఠశాలకు వెళ్లడానికి భయమేస్తోంది. వర్షాకాంలో మోకాలి లోతు నీరు, బురదలో నడుచుకుంటూ వెళ్తున్నాం. ఇప్పుడేమో దుమ్మూధూళితో ఇబ్బంది పడుతున్నాం. పాఠశాలకు వెళుతూ అనారోగ్యం బారిన పడాల్సి వస్తోంది. ప్రజాప్రతినిధులు స్పందించి పాఠశాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలి.

ఇంట్లో అగ్నిప్రమాదం



నవతెలంగాణ-లక్ష్మణచాంద

మండల కేంద్రంలో అద్దెకుంటున్న చాకలి రాములు ఇంట్లో ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం జరిగింది. ఆదివారం పండుగ పూట దేవుడి విగ్రహం వద్ద దీపాన్ని వెలిగించారు. దాన్ని ఎలుకలు పడగొట్టడంతో అగ్ని ప్రమాదం సంభవించింది. ఎవరికి ఎలాంటి గాయాలు కాకపోయినా సుమారు రూ.లక్ష వరకు ఆస్తి నష్టం జరిగినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సర్పంచ్ ముత్యంరెడ్డి, ఎంపీపీ అడ్వాల పద్మ రమేష్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

రేషన్ బియ్యం పట్టివేత

నవతెలంగాణ-కుభీర్

పార్డి-బి గ్రామంలో ఓ వ్యాపారి అక్రమంగా రేషన్ బియ్యం కొనుగోలు చేస్తున్న విషయం తెలుసుకుని పట్టుకున్నామని ఎస్ఐ ఎండి షరీఫ్ తెలిపారు. ప్రజల వద్ద నుంచి తక్కువ ధరకు తీసుకొని ఎక్కువ ధరకు విక్రయించేందుకు సిద్ధంగా ఉంచిన 10క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. పట్టుబడ్డ బియ్యాన్ని తహసీల్దార్‌కు అప్పగించారు.

ఖదీర్‌ఖాన్ మృతికి కారకులైన పోలీసుల్ని సస్పెండ్ చేయాలి

నవతెలంగాణ-ఖానాపూర్

ఖదీర్‌ఖాన్ మృతికి కారకులైన ఎస్సై, ఇద్దరు కానిస్టేబుల్స్‌ను వెంటనే ఉద్యోగాల నుంచి తొలగించాలని ముస్లిం హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు న్యాయవాది షబ్బీర్ పాషా డిమాండ్ చేశారు. ఆదివారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మెదక్ జిల్లాకు చెందిన ఖదీర్‌ఖాన్ కుటుంబానికి సీఎం కేసీఆర్ న్యాయం చేయాలన్నారు. ఖదీర్‌ఖాన్ మరణానికి కారణమైన మెదక్ జిల్లా పోలీసుల తీరును తెలంగాణ ముస్లిం హక్కుల పోరాట సమితి తీవ్రంగా ఖండిస్తోందన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం ఈ కేసును లాకప్ డెత్‌గా పరిగణించాలన్నారు. పోలీసులపై ఐపీసీ 302 సెక్షన్ కింద కేసులను నమోదు చేసి, మృతుని కుటుంబానికి రూ.50 లక్షల పరిహారం, భార్యకు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలన్నారు.

నిర్మల్ : మెదక్ జిల్లాలో పోలీసుల చేతిలో చిత్రహింసలకు గురై మృతి చెందిన మహమ్మద్ ఖదీర్ ఖాన్ మృతిపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర కార్యదర్శి ఆరెపల్లి విజయ్ కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దొంగతనం చేశాడనే అనుమానంతో కూలీ పని చేసుకొని జీవనం గడిపే ఖదీర్‌ఖాన్‌ను పోలీసులు అనాగరికమైన పద్ధతులతో విచారించడం అత్యంత సిగ్గుచేటని పేర్కొన్నారు. ఐదు రోజులు చిత్రహింసలకు గురిచేసి నేరాన్ని ఒప్పించే ప్రయత్నం చేయడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం ఈ కేసును లాకప్ డెత్‌గా పరిగణించాలని, ఖదీర్ ఖాన్‌ను చిత్రహింసలకు గురిచేసిన ఎస్ఐ, ఇద్దరు కానిస్టేబుళ్లను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. వీరిపై ఐపీసీ 302 సెక్షన్ కింద కేసులను నమోదు చేయాలని, ఖదీర్ ఖాన్ కుటుంబానికి రూ. 50 లక్షల నష్టపరిహారం ఇవ్వాలని, అతని భార్యకు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని కోరారు.

భక్తులతో శివాలయాలు కిటకిట



సిరికొండలో...

నవతెలంగాణ-సిరికొండ

శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంతో పాటు మండలంలోని ఆయా గ్రామాలలో ఆదివారం శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. కొండాపూర్ శివారులోని అతి పురాతన శివాలయానికి భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

నార్నూర్ : చోర్గావ్, పట్నాపూర్ సిద్దేశ్వర ఆలయం, తాడిహత్నూర్‌ని ఎస్టీ వాడ శివాలయం భక్తులతో కిటకిటలాడాయి. చోర్గావ్‌లో జెడ్పీ చైర్మన్ జనార్దన్ రాథోడ్ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. తాడిహత్నూర్‌లో అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు జాదవ్ బాబు, జాదవ్ ప్రసురాం, జాదవ్ సూరజ్, జాదవ్ సవాయిరాం, జాదవ్ పృథ్వీరాజ్, జాదవ్ గోకుల్, జాదవ్ ఉమాజీ, మరప్ప భాస్కర్, మెస్రం రవీందర్, జాదవ్ ఉపేందర్, రాథోడ్ దారాసింగ్, పవార్ రామారావ్, రాథోడ్ దేవుజీ, పవార్ ప్రకాష్, యూత్ సభ్యులు జాదవ్ జితేందర్, జాదవ్ మహేష్ పాల్గొన్నారు.

ఆదిలాబాద్ రూరల్ : మావల మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాలలో శివపార్వతుల కళ్యాణం ఘనంగా నిర్వహించారు. కచ్‌కంటి గ్రామంలోని మార్కండేయ ఆలయంలో ఎమ్మెల్యే జోగు రామన్న ప్రత్యేక పూజలు చేశారు. భీంసరి, అనుకుంట, యాపల్‌గూడ, కుంబఝరి, న్యూ రాంపూర్, అంకోలి, అంకాపూర్ గ్రామాల్లోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఈ కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ అడ్డి భోజారెడ్డి, ఎంపీపీ గంద్రత్ రమేష్, మాజీ మార్కెట్ చైర్మన్ మెట్టు ప్రహ్లాద్, గ్రామ సర్పంచ్ కుర్ర లక్ష్మి శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు సెవ్వ జగదీష్ యాదవ్, బండారి దేవన్న పాల్గొన్నారు.

తాంసి : మండలంలోని వడ్డాడి గ్రామంలో లక్ష్మీనరసింహ స్వామి ఆలయ జాతర సందర్భంగా ఆదివారం ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్తుల కోరిక మేరకు ఆలయ అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేశామన్నారు. గ్రామస్థులు అందరూ ఐక్యతతో జాతర నిర్వహించడం, చుట్టు పక్కల గ్రామాల నుండి వచ్చిన భక్తులకు అన్నదానం చేపట్టడం గొప్ప విషయమన్నారు. ఎమ్మెల్యేలను ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాస్, ఎంపీపీ మంజుల శ్రీధర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల కన్వీనర్ అరుణ్‌కుమార్, నాయకులు క్రిష్ణ, మహేందర్, గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.



ఆదిలాబాద్‌రూరల్‌లో...

ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌అర్బన్

జిల్లా కేంద్రంలో మహారాజ్ ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. శివాజీ చౌక్‌లో ఆరె మరాఠా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేడుకలు ఎమ్మెల్యే జోగు రామన్న ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. శివాజీ మహారాజ్ చిత్రపటం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శివాజీ మహారాజ్ స్ఫూర్తివంతమైన పాలనను ప్రజలకు అందించి విశేషమైన జనాదరణ పొందారని కొనియాడారు. ఆ మహనీయుడి ఆశయాలు, విలువలను యువతరం స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. శివాజీ చిన్న వయసులోనే యుద్ధంలో పోరాటాలు చేసి శత్రువులను సంహరించారని, తన మాతృమూర్తితో పాటు గురువుల మార్గ నిర్దేశనంలో నడిచి ప్రజారంజక పాలనను అందించారని గుర్తు చేశారు. ఇతర మతాలకు సైతం తగిన గౌరవం ఇచ్చేవారని గుర్తు చేశారు. శివాజీ మహారాజ్ జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శప్రాయంగా నిలిచిందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ అడ్డి భోజారెడ్డి, ఆరె మరాఠా సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు దశరథ్ పటేల్, సనాతన హిందూ ఉత్సవ సమితి అధ్యక్షులు ప్రమోద్ కుమార్ ఖత్రి, నాయకులు శివకుమార్ పాల్గొన్నారు.

నిర్మల్ : ఛత్రపతి శివాజీ జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆరే మరాఠా సంఘ సభ్యులతో కలిసి మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్ జిల్లా కేంద్రంలోని శివాజీ చౌక్‌లో గల విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. శివాజీ మహారాజ్ దేశానికే గర్వకారణమని కొనియాడారు. రాష్ట్ర మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి కృషితో పట్టణ నడి ఒడ్డున శివాజీ విగ్రహాన్ని నెలకొల్పామని తెలిపారు. నేటి యువత శివాజి అడుగుజాడల్లో నడవాలని సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు రామగోని నర్సాగౌడ్, బిట్లింగ్ నవీన్, కౌన్సిలర్ శంకర్‌పతి, మాజీ కౌన్సిలర్ పతికే శ్రీనివాస్, జిల్లా ఆరే మరాఠా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

లక్ష్మణచాంద : ఛత్రపతి శివాజీ 354 జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించినారు. సర్పంచ్ ముత్యంరెడ్డి ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ప్రధాన కూడలిలో జయంతి ఉత్సవాలు నిర్వహించినారు. పార్పెల్లి గ్రామంలో బీజేపీ మండల అధ్యక్షులు మెంగు అనిల్ ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహించినారు. ఈ కార్యక్రమలలో గుడ్ల రంజిత్, గంగాధర్, కుందేళ్ల హరీష్, యువకులు పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి : ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలను ఆదివారం గ్రామగ్రామాన జరుపుకున్నారు. మండలంలోని ధనోర-బి, ఇంద్రవెల్లి, శంకర్‌గూడలో జయంతి ఘనంగా జరుపుకున్నారు. శంకర్‌గూడలో జడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్ధన్ హాజరై శివాజీ చిత్రపటానికి తిలకం దిద్ది పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. అనంతరం మండల కేంద్రంలో బైక్ ర్యాలీ నిర్వహించి అన్నదానం చేశారు. కార్యక్రమంలో మారుతి డోంగ్రె, సంతోష్, కేశవ్ ముస్లే, మర్శకోల తిరుపతి, కనక తుకారాం, శ్రీను, సర్పంచ్ లక్ష్మణ్, సుధీర్, భీంరావ్, కేశవ్ గుట్టే పాల్గొన్నారు.

సిరికొండ : ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలు మండల కేంద్రంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రతి ఒక్కరూ ఆయన చూపిన బాటలో నడుచుకోవాలని పలువురు నాయకులు సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, ఛత్రపతి శివాజీ యూత్ సభ్యులు బాలాజీ, పెంటన్న, సునీల్ పటేల్, సందీప్, గజానంద్, దత్తురామ్, గొర్ల శంకర్ పాల్గొన్నారు.

కుభీర్ : మండల కేంద్రంతో పాటు పార్డి-బి, గోడపూర్, పల్సి, సోనారి గ్రామాల్లో శివాజీ మహారాజ్ జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో సర్పంచులు ఆనంద్‌రావు, కో ఆప్షన్ సభ్యుడు దత్తుహరి పటేల్, బాలాజీ, పుష్పలత, రాజేశ్వర్, సురేష్ బాబు, పోశెట్టి పాల్గొన్నారు

నార్నూర్ : శివాజీ మహారాజ్ గొప్ప పోరాట యోధుడని సర్పంచ్ మధుకర్ రాథోడ్ అన్నారు. ఆదివారం మండలంలోని తాడిహత్నూర్ గ్రామంలో శివాజీ మహారాజ్ జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి చంద్రశేఖర్, ఉపసర్పంచ్ విష్ణు, శివాజీ యూత్ ప్రెసిడెంట్ రవీందర్, నాయకులు సూరజ్ జాదవ్, కోటగిరి విశాల్, కేంద్రే సురేష్, విగ్రహ దాత సంతోష్ కేంద్రే పాల్గొన్నారు.

బేల : మండలంలోని కామ్గార్‌పూర్‌లో శివాజీ జయంతి ఉత్సవాల్లో ఎమ్మెల్యే జోగు రామన్న పాల్గొని నూతన విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాజు బాగుంటే రాజ్యాలు బాగుంటాయన్నారు. కులాలు, మతాలు గౌరవించబడతాయన్నారు. శివాజీ స్ఫూర్తితో బీఆర్ఎస్ ముందుకెళ్తుందన్నారు. బెదోడ గ్రామంలో మరాఠా కులస్తుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శివాజీ మహారాజ్ జయంతి వేడుకల్లోనూ ఎమ్మెల్యే పాల్గొన్నారు. అనంతరం శివాజీ నూతన విగ్రహాన్ని ఎమ్మెల్యే గ్రామస్తులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం సభలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రావుత్ మనోహర్, మండల నాయకులు పాల్గొన్నారు.



ఆదిలాబాద్‌అర్బన్

బాసర : మండల కేంద్రంలోని శివాజీ చౌక్‌లో ఆదివారం శివాజీ మహారాజ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం గ్రామపుర వీధుల గుండా బైక్ ర్యాలీ నిర్వహించారు. కిర్గుల్(బి)లో శివాజీ మహారాజ్ విగ్రహాన్ని సర్పంచ్ సుధాకర్‌రెడ్డి ఆవిష్కరించారు. సర్పంచ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ శివాజీ అడుగుజాడల్లో నడవాలని సూచించారు కార్యక్రమంలో ఎంపీటీసీ కారండే ప్రభాకర్, కారోబారి సాయిరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

సారంగాపూర్ : మండలంలోని జామ్, స్వర్ణ, అలుర్ గ్రామాల్లో ఆదివారం హిందూ వాహిని అధ్వర్యంలో శివాజీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హిందువాహిని జిల్లా సహ సమ్యోజక్ దాసరి ప్రశాంత్, అడెపు మహేందర్, దాత్రిక రాము, కరిపే విలాస్, తిరుమల చారి, పతాని నరేష్, బండి సురేష్, నివేష్ పాల్గొన్నారు.

తలమడుగు : మండల కేంద్రంలో శివాజీ జయంతిని సర్పంచ్ కరుణాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. శోభయాత్ర పుర వీధుల గుండా సాగింది. శివాజీ చేసిన సేవలను కొనియాడారు. శోభ యాత్రలో హిందూ ఉత్సవ సమితి నాయకులు నల్ల పద్మాకర్‌రెడ్డి, గ్రామస్తులు ప్రేమేందర్, అజయ్, సాయి, సంపత్, శ్రీకాంత్, వంశీ, నవీన్, వెంకటేష్ పాల్గొన్నారు.



నిర్మల్‌లో...



కుభీర్‌లో...



బాసరలో...



తలమడుగులో...

అనుదినం జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
సోమవారం 20 ఫిబ్రవరి 2023

లాకప్ డెత్‌గా పరిగణించాలి

నవతెలంగాణ-జైపూర్

ఖదీర్ ఖాన్ మృతి లాకప్ డెత్‌గా పరిగణించి రాష్ట్ర ప్రభుత్వం రూ.50 లక్షల నష్టపరిహారం చెల్లించాలని తెలంగాణ ముస్లీం హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు మహమ్మద్ ఫయాజుద్దీన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఖదీర్ ఖాన్ మృతికి కారకులైన మెదక్ జిల్లా పోలీసుల తీరును తెలంగాణ ముస్లీం హక్కుల పోరాట సమితి ఖండిస్తోందని తెలిపారు. సుప్రీం కోర్టు ఆదేశాల మేరు ఖదీర్ ఖాన్‌ను చిత్రహింసలకు గురి చేసిన ఎస్సైతో పాటు కానిస్టేబుళ్లను వెంటనే ఉద్యోగాల నుండి తొలగించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా కేసును పక్కదోవ పట్టించేందుకు ప్రయత్నిస్తున్న మెదక్ డీసీపీని వెంటనే బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. బాధ్యులపైన పోలీసుల పై 302 సెక్షన్ కింద కేసులు నమోదు చేయడంతో పాటు మృతుని కుటుంబలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడిగా అబ్దుల్ అజీజ్

నవతెలంగాణ-రామకృష్ణాపూర్

రామకృష్ణాపూర్(క్యాతన్‌పల్లి) మున్సిపాలిటీ బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడిగా అబ్దుల్ అజీజ్, పట్టణ ఇన్‌ఛార్జిగా సీనియర్ నాయకులు గాండ్ల సమ్మయ్యలను ఆదివారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే, బీఆర్ఎస్ మంచిర్యాల జిల్లా అధ్యక్షులు బాల్క సుమన్ నియమించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాల్క సుమన్ వారిద్దరికీ శుభాకాంక్షలు తెలిపారు. సమిష్టితో పనిచేసి పార్టీని మరింత బలోపేతం చేయాలని, పాలకవర్గ సభ్యులతో పాటు పార్టీ నాయకులందరినీ కలుపుకొని రామకృష్ణాపూర్ మున్సిపాలిటీలో పార్టీని మరింత బలోపేతం చేయాలని నూతనంగా ఎన్నికైన వారికి సూచించారు. కార్యక్రమాలతో పాటు, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేలా చొరవ చూపాలన్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికయిన పట్టణ అధ్యక్షులు అబ్దుల్ అజీజ్, పట్టణ ఇన్‌ఛార్జి గాండ్ల సమ్మయ్య మాట్లాడుతూ తమపై నమ్మకం ఉంచిన బాల్క సుమన్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

జాగా దొరికితే పాగా..!

- జిల్లా కేంద్రంలో పెరుగుతున్న అక్రమ టేలాలు
- రోడ్డుపైనే దుకాణాలతో పెరుగుతున్న ట్రాఫిక్ కష్టాలు
- తొలగించకుండా అధికారులపై నాయకులు ఒత్తిళ్లు
- నష్టపోతున్నామని ఆర్టీసీ టెండర్ దారుల ఆవేదన



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలో జాగా దొరికితే కబ్జాదారులు పాగా వేస్తున్నారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ నుండి వివేకానంద చౌక్ మీదుగా ఏఆర్ హెడ్ క్వార్టర్స్ బాలికల పాఠశాల ముందు వరకు, ఇటువైపు డిఎస్పి ఆఫీస్ వరకు అక్రమ టేలాల పరంపర కొనసాగుతోంది. గ్రామ పంచాయతీకి రూ.లక్షలు ఆదాయం రావాల్సి ఉన్నప్పటికీ కిరాయి రూపంలో అతి తక్కువ మొత్తంలో వస్తోంది. ఇష్టం వచ్చినట్టుగా టేలాలు వేయడంతో రోజురోజుకు ట్రాఫిక్ కష్టాలు పెరుగుతున్నాయి. ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా పంచాయతీ టేలాలు ఉండడంతో టెండర్ దారులు కూడా నష్టపోవాల్సి వస్తుంది. ఈ సందర్భంలో జిల్లా కేంద్రంలోని అక్రమ టేలాలు, ప్రజల ఇబ్బందుల ప్రత్యేక కథనం.

జాగా దొరికితే దర్జాగా పాగా

జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ నుండి ఏఆర్ హెడ్ క్వార్టర్స్ వరకు ఇరువైపులా ఎక్కడ జాగ దొరికిన అక్రమార్కులు టేలాతో కబ్జా చేస్తున్నారు. ఈ ప్రాంతంలో మొత్తం 280 వరకు టేలాలు ఉన్నాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఎక్కడ ఖాళీ జాగా ఉంటే అక్కడ చిన్నగా మొదట ఆక్రమించి తర్వాత అదే స్థానంలో శాశ్వత షెడ్డు నిర్మిస్తున్నారు. దీంతో రోడ్డు ఇరుకుగా మారడం..జిల్లా కేంద్రం కావడంతో రోజురోజుకు ట్రాఫిక్ పెరగడంతో ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. జిల్లా ఆవిర్భావానికి పూర్వం కొంత స్థలం ఖాళీగా ఉండేది. అయితే జిల్లా ఆవిర్భావం తర్వాత జనాభా పెరగడం స్థలం లేకపోవడంతో ప్రభుత్వ స్థలాలపై కబ్జాదారుల కన్ను పడింది. దీనితో మార్కెట్‌కు అనువైన ప్రధాన ప్రాంతం కావడంతో అక్రమంగా టేలాలు వెలుస్తున్నాయి. ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లే ప్రధాన రహదారి మినహా మిగతా ప్రాంతాన్ని ఆక్రమించారు. ఇదే ప్రాంతంలో ఉన్న ఉర్దూ మీడియం పాఠశాల ప్రహరిని అనుకోని టేలాలు వేయడంతో పాఠశాల కనిపించకుండా పోతోంది.

అధికారులపై నాయకులు ఒత్తిళ్లు..?

టేలాలు తొలగించడానికి గత సంవత్సరం జూన్ నెలలో పంచాయతీ అధికారులు ప్రయత్నించి అక్రమంగా ఆక్రమించిన వాటికి తాళాలు వేశారు. దీంతో కొందరు నాయకులు జోక్యం చేసుకొని అధికారులను బెదిరింపులకు గురిచేసినట్లు తెలిసింది. దీంతో తామేమీ చేయలేకపోతున్నామని నాయకుల ఒత్తిళ్ల తీవ్రంగా ఉన్నాయని ఓ అధికారి చెబుతున్నారు. గతంలో జిల్లా ఆవిర్భావం కంటే ముందు సబ్ కలెక్టర్ గా పనిచేసిన దేవవ్రతకంట ఈ అక్రమ టేలాలపై ఉక్కు పాదం మోపినప్పటికీ, ఆయన బదిలీ తర్వాత పరిస్థితి శరామాములుగా మారింది.

గ్రామపంచాయతీ ఆదాయానికి గండి

జిల్లా కేంద్రంలో ఎక్కువగా డిమాండ్ ఉన్న ప్రాంతం అయినప్పటికీ అక్రమ టేలాలతో గ్రామపంచాయతీ ఆదాయానికి గండి పడుతుంది. ప్రధాన మార్కెట్లో 280 వరకు టేలాలు ఉన్నాయి. అంబేద్కర్ చౌక్ ప్రాంతంలో ఒక్కదానికి నెలకు రూ.350 చొప్పున వివేకానంద చౌక్ నుండి ప్రభుత్వ ఆసుపత్రి పాత గేట్ వరకు రూ. 250 చొప్పున ఆ తర్వాత రూ.150 చొప్పున గ్రామపంచాయతీ అద్దె వసూలు చేస్తుంది. ఈ ప్రాంతాల్లో అక్రమార్కులు మూడు నుండి ఐదు టేలాలు వేసుకొని వేరే వ్యక్తులకు కిరాయికి ఇవ్వడంతో పాటు ఈ ప్రాంతంలో ఉన్న డిమాండ్‌ను ఆధారంగా చేసుకుని రూ.2 నుండి రూ.3 లక్షలు వరకు అడ్వాన్స్ తీసుకోవడంతో పాటు రూ.5వేల నుండి రూ.7వేల వరకు కిరాయి తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. గతంలో అధికారులు దీనిని రూపుమాపడానికి ప్రయత్నం చేసినప్పటికీ వారితో సాధ్యం కాలేకపోయింది. జిల్లా స్థాయి అధికారులు దృష్టిసారిస్తేనే ఈ అక్రమ దందా పోయి పంచాయతీ ఆదాయం పెరిగే అవకాశం ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఆర్టీసీ కాంప్లెక్స్ టెండర్ దారుల ఆవేదన

పట్టణంలోని అంబేద్కర్ చౌక్ నుంచి వివేకానంద చౌక్ మధ్యలో ఆర్టీసీ అరేండ్ల క్రితం 18 షెటర్లతో దుకాణసముదాయం నిర్మించింది. టెండర్లు నిర్వహించగా ఒక్కో దుకాణానికి అద్దె రూ.6 వేల నుంచి రూ.12 వేల వరకు నిరుద్యోగులు, వ్యాపారులు దక్కించుకున్నారు. ప్రహరీని ఆనుకొని షాపింగ్ కాంప్లెక్స్ ఎదురుగా 24 టేలాలు ఉన్నాయి. ఆర్టీసీ కాంప్లెక్స్ నిర్మించినప్పటికీ ఆరు సంవత్సరాల నుండి ముందరి టేలాలు తొలగించకపోవడంతో టెండర్ దారులు రోడ్డున పడే పరిస్థితి తలెత్తింది. అటు ఆర్టీసీకి కిరాయి కడుతూ ఇటు దుకాణం నడపలేని పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతున్నారు. ఇప్పటివరకు ఆరు లక్ష రూపాయల వరకు అద్దె చెల్లించినట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీటితో పాటు రోడ్డుకు ఇరువైపులా టేలాలు వెలుస్తుండటంతో ట్రాఫిక్ సమస్యలు తీవ్రమవుతున్నాయి. వాహనదారులు, పట్టణవాసులు ఇబ్బందులు పడాల్సివస్తోంది.

పరిష్కారం కోసం ప్రయత్నం చేయాలి

అధికారులు ఎందరు మారినా జిల్లా కేంద్రంలోని పరిస్థితి మారకపోవడం పట్ల పట్టణ ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఏఆర్ హెడ్ క్వార్టర్స్ నుండి రూ.50 లక్షలు వెచ్చించి వేసిన రహదారి ఇరువైపుల డ్రైనేజీ కూడా వృధాగా మారి వర్షాకాలంలో రోడ్డుపై నీరు నిలిచి ఇబ్బందులు పెడుతుంది. దీనిపై నాయకులు దృష్టి సారించి పాత మార్కెట్ కూల్చివేసిన స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించి టేలాలపై జీవిస్తున్న పేదలకు ఉపాధి కల్పించినట్లయితే జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ సమస్య తీరుతుంది. ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా నిర్మించిన టేలలను కాంప్లెక్స్ వైపు తిప్పి పెట్టినట్లయితే ఆర్టీసీ కాంప్లెక్స్ కూడా డిమాండ్ పెరిగి నిరుద్యోగులకు న్యాయం కలుగుతుంది.

అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటాం

బోర్కడే హేమంత్, జిల్లా కలెక్టర్

జిల్లా కేంద్రంలో టేలాలపై, ఆర్టీసీ కాంప్లెక్స్ అధికారులతో మాట్లాడి అవసరమైన చర్యలు తీసుకుంటాం. వాటిపై ఆధారపడి జీవిస్తున్న వారికి అన్యాయం జరగకుండా చూస్తాం.

అధికారులు న్యాయం చేయాలి

చిప్ప సురేష్, ఆర్టీసీ కాంప్లెక్స్ టెండర్ దారుడు

ఎటువంటి ఆదాయం లేకున్నప్పటికీ టెండర్ దక్కించుకున్నామన్న ఒకే కారణంతో ఆర్టీసీకి ఆరు సంవత్సరాల నుండి కిరాయి చెల్లిస్తున్నాము. అధికారులు స్పందించి కాంప్లెక్స్ ఎదుట టేలాలు తొలగించి న్యాయం చేయాలని కోరుతున్నాము.

నేటి పాదయాత్రను విజయవంతం చేయండి

- సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి రాజేందర్

నవతెలంగాణ-జైనూర్

సమస్యలు పరిష్కరించాలని సోమవారం గ్రామ పంచాయతీ కార్మికులు చేపట్టే పాదయాత్రను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి రాజేందర్ అన్నారు. ఆదివారం మండలకేంద్రంలో గ్రామ పంచాయతీ కార్మికులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న ప్రతి కార్మికుడికి పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనాలు రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీ కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగభద్రత, కారోబార్‌లకు ప్రత్యేక స్టేటస్ కల్పించాలని కోరారు. జీవో నెంబర్ 51ని వెంటనే సవరించి గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని తెలిపారు. గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలపై సీఐటీయూ ఆధ్వర్యంలో నిరంతరం పోరాటం చేస్తామని తెలిపారు. ఈ పాదయాత్రకు జిల్లాలోని వివిధ గ్రామాల్లో పనిచేస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో గ్రామ పంచాయతీ కార్మికులు మెస్రం శంభు, పుష్పలత, రాణి, రాంజీ, పోచయ్య వెంకయ్య పాల్గొన్నారు.

మంచినీటి ట్యాంకు ప్రారంభం

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని పొనకల్ గ్రామపంచాయతీ పరిధిలోని పోలీస్‌స్టేషన్ వెనుక గల జగదంబ ఆలయం ఆవరణలో రూ.50 వేలతో నిర్మించిన తాగునీటి ట్యాంకును ఆదివారం కలమడుగు గ్రామపంచాయతీ పరిధిలోని రాములు నాయక్ తాండ వాసి, విశ్రాంత కలెక్టర్ ఎల్.శర్మన్ నాయక్ ప్రారంభించారు. శర్మన్ తండ్రి రాములునాయక్ జ్ఞాపకార్థం రూ.50 వేలతో ట్యాంక్ నిర్మించగా, రవీందర్ టీచర్ రూ.10వేలతో మోటర్, విద్యుత్ సౌకర్యం కల్పించారు. ఈ సందర్భంగా శర్మన్ మాట్లాడుతూ, జగదంబ ఆలయానికి తన వంతు సహకారం అందిస్తానన్నారు. ఆలయ ఆవరణలో పక్కా భవనం, ఫంక్షన్ హాల్, ప్రహరి గోడ, ఇతర సౌకర్యాల కోసం అందరూ కృషి చేయాలన్నారు. ఆ తర్వాత ఆ గ్రామ యువకులకు 100 టీ-షర్టులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు జాదవ్ సందేశ్, ఎల్.చందునాయక్, బాదావత్ ప్రకాష్ నాయక్, రాజు నాయక్, రాజన్న, సక్రునాయక్, రవీందర్ పాల్గొన్నారు.

నేత్రపర్వంగా శివపార్వతుల కల్యాణం

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని తపాలాపూర్ గ్రామంలోని శ్రీచంద్రమౌళీశ్వర స్వామి శివాలయంలో శనివారం రాత్రి ఎనిమిది గంటలకు శివపార్వతుల కళ్యాణం ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ నైనాల తిరుపతి, జన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీపతి పద్మ బుచ్చన్న గ్రామ పెద్దల సమక్షంలో ఈ కళ్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు.

కేతేశ్వర స్వామి ఆలయంలో..

మండల కేంద్రం శివారులోని పోలీస్ స్టేషన్ ఎదురుగా వీర్లగుట్టపై ఉన్న శ్రీకేతేశ్వర స్వామి, కంకాలమ్మ దేవాలయంలో శివపార్వతుల కల్యాణం వైభవంగా జరిగింది. మహాశివరాత్రిని పురస్కరించుకొని ఆ దేవాలయం ఆవరణలో వేద పండితులు ఆదివారం శివపార్వతుల కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ఎంఆర్ నరసింహారావు, చిలువేరు నరసయ్య, అశోక్, రాజన్న పాల్గొన్నారు.

స్నేహకు పూర్తి సహాయ సహకారాలు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

ఎంబీబీఎస్ విద్యార్థిని దుర్గం స్నేహకు తమ వంతు పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని తెలంగాణ రాష్ట్ర రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు తెలిపారు. కాగజ్‌నగర్ పట్టణం అంబేద్కర్ కాలనీకి చెందిన దుర్గం స్నేహ ఇటీవల ఎంబీబీఎస్ సీటు సాధించడంతో ఆమెను ఆదివారం స్థానిక సంఘం భవనంలో ఘనంగా సన్మానించి ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ నిరుపేద కుటుంబం నుంచి వచ్చిన దుర్గం స్నేహ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం వల్లే నేడు ఎంబీబీఎస్ సీటు సాధించిందని అన్నారు. ఎంబీబీఎస్ పూర్తి చేసేందుకు ఆమెకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు. కోర్సు పూర్తి అయిన తర్వాత నిరుపేదలకు, వృద్ధులకు సేవ చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు ఎం.జయదేవ్ అబ్రహం, కార్యదర్శి ఎం.శివప్రసాద్, సంఘం నాయకులు నర్సయ్య, షేక్ మహబూబ్, బాగవాండ్లపల్లి నర్సయ్య, ఎం.సుభాష్, టి.నర్సింగారావు, కె.లింగమ్మ పాల్గొన్నారు.

21న గౌడజన హక్కుల పోరాట సమితి సమావేశం

నవతెలంగాణ-రెబ్బెన

గౌడజన హక్కుల పోరాట సమితి(మోకుదెబ్బ) మండల స్థాయి సమావేశాన్ని ఈ నెల 21న మండల కేంద్రంలోని శ్రీరేణుక ఎల్లమ్మతల్లి ఆలయంలో నిర్వహిస్తున్నట్టు ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంజనేయులు గౌడ్ తెలిపారు. ఆదివారం నంబాల, నారాయణపూర్, కొమురవెల్లి, గంగాపూర్ గ్రామాల్లో మేకుదెబ్బ సంఘం నాయకులు పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గౌడ కులస్తులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఐక్య పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. మంగళవారం ఉదయం 11 గంటలకు నిర్వహించే సమావేశానికి కల్లుగీతా కార్మికులు, కుల బాంధవులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు వడ్లకొండ రామాగౌడ్, సీనియర్ నాయకులు మడిపల్లి లక్ష్మీనారాయణగౌడ్, తాళ్లపెల్లి శ్రీనివాస్‌గౌడ్, రెబ్బెన గ్రామ సొసైటీ అధ్యక్షుడు తాళ్లపెల్లి కృష్ణాగౌడ్, మల్లాగౌడ్, రవిగౌడ్, తిరుపతి గౌడ్ పాల్గొన్నారు.

క్రికెట్ విజేతలకు బహుమతుల ప్రదానం

నవతెలంగాణ-రామకృష్ణాపూర్

పట్టణంలోని స్థానిక ఠాగూర్ స్టేడియంలో సీనియర్ క్రికెట్ క్రీడాకారుడు స్వర్గీయ నూకల మోహన్ స్మారకార్థం మహాశివరాత్రి జాగరణ క్రికెట్ పోటీలు శనివారం రాత్రి ప్రారంభించి ఆదివారంతో ముగిశాయి. ఈ పోటీలలో సుమారు 30 జట్లు పాల్గొనగా శివ ఎలెవెన్ టీం మొదటి బహుమతి సాధించింది. రూ.8000 నగదు ట్రోఫీని ఎన్‌బీ స్ట్రైకర్ టీం రన్నర్ టీంకు రూ.4000 నగదు ట్రోఫీని బీఆర్ఎస్ పట్టణ ఇన్‌ఛార్జి గాండ్ల సమ్మయ్య బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారులు, స్మారకార్థ ఆర్గనైజర్లు జగదీష్, వెంకట్ పాల్గొన్నారు.

17 ఏండ్లకు కలిసిన పూర్వ విద్యార్థులు

నవతెలంగాణ-జన్నారం

మండల కేంద్రంలోని రాజశేఖర ప్రైవేటు ఉన్నత పాఠశాలలో చదువుకున్న టెన్త్ విద్యార్థులు 17 సంవత్సరాల తర్వాత మళ్లీ కలిశారు. 2005-2006 సంవత్సరంలో టెన్త్ చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం మండల కేంద్రంలోని పీఆర్టీయూ భవన్‌లో గురుశిష్యుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పుడు తమకు పాఠాలు బోధించిన ఉపాధ్యాయులను శాలువాలతో సన్మానించారు. బాల్యంలో జరిగిన సంఘటనను గుర్తుచేసుకొని, జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ఆ విద్యా సంవత్సరంలో చదివిన విద్యార్థులు వారికి చదువులు చెప్పిన గురువులు పాల్గొన్నారు.

నిన్న ప్రియుడి..నేడు ప్రియురాలు

రోజు వ్యవధిలో ప్రేమ జంట ఆత్మహత్య





నవతెలంగాణ-హాజీపూర్

ఒకరిని విడిచి ఒకరు ఉండలేక పురుగుల మందు తాగి ప్రేమ జంట ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని దొనబండలో చోటుచేసుకుంది. దొనబండ గ్రామానికి చెందిన నాగవెల్లి శ్రీకాంత్(24)ఆటో డ్రైవర్‌గా పని చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన డిగ్రీ మూడవ సంవత్సరం చదువుతున్న సంఘవి(21) అనే యువతీ గత 3 సంవత్సరాలుగా ప్రేమించుకుంటున్నారు. విషయం కుటుంబ సభ్యులకు తెలపడంతో కులాలు వేరైనప్పటికీ ఇరువురి కుటుంబ సభ్యుల ఒప్పందం మేరకు వివాహం జరిపేందుకు నిర్ణయించుకున్నారు. శ్రీకాంత్ ఆటో డ్రైవర్ కావడంతో ఆర్థిక ఇబ్బందులు తలెత్తి అప్పుల పాలయ్యాడు. పెళ్లి నిశ్చయమవడం, ఎక్కువ అప్పులు అవ్వడంతో మనస్తాపం చెంది హాజీపూర్ మండలంలో గుడిపేట గ్రామ పరిధిలోని శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు సమీప పోచమ్మ ఆలయం వద్ద గత శుక్రవారం తన ప్రియురాలు సంఘవితో మాట్లాడుతూ క్రిమిసంహారక మందు తాగాడు, తను లేని జీవితం ఎందుకని మనస్తాపం చెంది ప్రియురాలు సంఘవి కూడా పురుగుల మందు సేవించింది. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో మంచిర్యాలలోనీ ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందించారు. పరిస్థితి విషమించడంతో శనివారం సాయంత్రం శ్రీకాంత్ చనిపోగా రాత్రి సంఘవి కూడా చనిపోయింది. ప్రేమికుల మృతితో రెండు కుటుంబాల మధ్య విషాదఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన హాజీపూర్ పోలీసులు తెలిపారు.

ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడాలి

- రామగుండం పోలీస్ కమిషనర్ రెమో రాజేశ్వరి



నవతెలంగాణ-జైపూర్

వేలాల జాతరకు వచ్చిన సందర్శకులకు ట్రాఫిక్ ఇబ్బందులు కల్గకుండా చూడాలని రామగుండం పోలీస్ కమీషనర్ రెమో రాజేశ్వరి ఆదేశించారు. మంచిర్యాల డీసీపీ కేకన్ సుధీర్ రాంనాథ్, జైపూర్ ఏసీపీ నరేందర్‌లతో కలిసి ఆదివారం వేలాల మల్లన్నను దర్శించుకోవడంతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సంధర్భంగా మాట్లాడుతూ మహా శివరాత్రిని పురస్కరించుకుని వేలాలలో జరిగే జాతరకు హాజరయ్యే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కల్గకుండా జాగ్రత్తలు తీసుకున్నట్లు తెలిపారు. దర్శనం కోసం తొక్కిసలాట జరగకుండా బారీకేడ్ల ద్వార భక్తులకు మల్లన్న దర్శనానికి ఏర్పాట్లు చేశామన్నారు. జాతరకు వచ్చే భక్తుల వాహణాల రాకపోకలు పార్కింగ్ ఏర్పాటు చేసి జాతరలో రద్దీ లేకుండా చూడగలిగామని పేర్కొన్నారు. వివిధ శాఖల అధికారుల సమన్వయంతో చేపట్టిన ఏర్పాట్లతో ఇక్కడికి వచ్చిన భక్తులకు శీఘ్ర ధర్శనంతో పాటు భక్తి భావంతో కూడిన అనుభూతి మిగిలేవిధంగా చూడాలని సూచించారు. వేలాల మల్లన్న దర్శనం తర్వాత భక్తులు క్షేమంగా ఇల్లు చేరుకోవడం కోసం శాఖ పరంగా తమవంతు సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో శ్రీరాంపూర్ సీఐ రాజు, స్థానిక ఎస్సై రామకృష్ణ పాల్గొన్నారు.

సంఘ బలోపేతానికి కృషి చేయాలి



నవతెలంగాణ-నస్పూర్

ఐఎన్‌టీయూసీ యూనియన్ బలోపేతానికి కృషి చేయాలని ఆ యూనియన్ రాష్ట్ర సెక్రటరీ జనరల్ జన ప్రసాద్ అన్నారు. ఆదివారం శ్రీరాంపూర్ నస్పూర్ ప్రెస్ క్లబ్‌లో పలువురికి యూనియన్ కండువాలు కప్పి యూనియన్ లోకి ఆహ్వానించారు. అనంతరం నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో ఇతర యూనియన్లలో ముఖ్య హోదాలో పనిచేసి కార్మికుల హక్కుల కోసం ఐఎన్‌టీయూసీ పోరాటానికి ఆకర్షితులై యూనియన్ లోకి వచ్చారని పేర్కొన్నారు. అలాగే వారికి యూనియన్‌లో పదవులు కేటాయిస్తూ నియామక పత్రాలను అందజేశారు. అందులో కలవేని శ్యాం సెంట్రల్ కమిటీ వైస్ ప్రెసిడెంట్, భీమ్ రవి డిస్ట్రిక్ట్ జనరల్ సెక్రెటరీ గా నియమించారు. సింగరేణి గుర్తింపు ఎన్నికల ప్రభావం అసెంబ్లీ ఎన్నికల ప్రభావంపై పడుతుందని భయంతో ప్రభుత్వం నిర్వహించడం లేదని ఆరోపించారు. ఐఎన్‌టీయూసీ పదవ, 11వ వేజ్ బోర్డులో పివలక పోవడం వల్లే కార్మికులకు తక్కువ శాతం వచ్చిందని, రానున్న వేజ్‌బోర్డులో ఐఎన్టీయూసీ పాల్గొని కార్మికులకు న్యాయమైన వేజ్ బోర్డ్ శాతాన్ని అందిస్తుందని పేర్కొన్నారు. జనక్ ప్రసాద్ ను తాత్కాలిక వేజ్ బోర్డ్ మెంబర్ నుండి పర్మనెంట్ మెంబర్గా నియమించినట్లు పేర్కొన్నారు. సమావేశంలో ఏరియా వైస్ ప్రెసిడెంట్ శంకర్ రావు, యూనియన్ నాయకులు భీమ్ రావు, సమ్మయ్య, సమ్ము రాజయ్య, గరిగేస్వామి, వెంకటేష్ పాల్గొన్నారు.

బీఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పండ్లు పంపిణీ

నవతెలంగాణ-సిర్పూర్(టీ)

ఆలిండియా కాన్ఫరేషన్ ఆఫ్ ఎస్సీ, ఎస్టీ ఆర్గనైజింగ్ రాష్ట్ర అధ్యక్షుడు కుల్పగిరి మహేశ్వర్‌రాజ్ జన్మదినం సందర్భంగా ఆదివారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో బీఎస్ఎఫ్ ఆధ్వర్యంలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు మాట్లాడుతూ నూతన పార్లమెంటు భవనానికి అంబేద్కర్ పేరు పెట్టాలని డిమాండ్ చేశారు. అన్ని పార్టీల మద్దతు కూడగట్టుకుని అంసెంబ్లీలో తీర్మాణం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆర్గనైజర్ డోంగ్రి మాణిక్, రాంటెంకి వినోద్, దుర్గం రజినీకాంత్ పాల్గొన్నారు.

రెండో రోజు కొనసాగుతున్న జాతర

నవతెలంగాణ-వాంకిడి

మండలకేంద్రంలో మహాశివరాత్రి సందర్భంగా శివకేశవ ఆలయ జాతర ఆదివారం రెండో రోజు కొనసాగుతుంది. వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు తమ మొక్కులు తీర్చుకుంటున్నారు. మహారాష్ట్రలోని చంద్రాపూర్ బల్లార్షా, రాజూరా, లకడ్‌కోట్, విరూర్, వరూర్‌తో పాటు ఆసిఫాబాద్, కెరమెరి, జైనూర్ మండలాల నుంచి భక్తులు వచ్చి మొక్కులు చెల్లించుకుంటున్నారు.

ముగిసిన రెండోవిడత బర్డ్ వాక్

నవతెలంగాణ-జన్నారం

కవ్వాల్ టైగర్ జోన్‌లో శనివారం ఆదివారం రెండు రోజులుగా నిర్వహించిన రెండవ దశ బర్డ్ వాక్ కార్యక్రమం ముగిసింది. ఆదివారం ఉదయం నుంచి, తాళ్లపేట అటవీ రేంజ్ పరిధిలోని గొండుగుడా, బైసన్ కుంట, అడవిలో పక్షి ప్రేమికులు బైనాకులర్లతో పక్షులను వారి కెమెరాలు బంధించుకున్నారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో పక్షి ప్రేమికులు అడవులను పక్షులను, ఆస్వాదించారు. బర్డ్ వాక్ కార్యక్రమంలో నిర్మల్ జిల్లా కలెక్టర్ వరుణ్ రెడ్డి, పాల్గొని పక్షి ప్రేమికులతో కలిసి ప్రకృతి అందాన్ని ఆస్వాదించారు. ఈ బర్డ్, వాక్ కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందని నిర్మల్ జిల్లా కలెక్టర్ వరుణ్ రెడ్డి అన్నారు. రెండు రోజులుగా కొనసాగిన బర్డ్ వాక్ కార్యక్రమం నేటితో ముగిసిందని జన్నారం ఎఫ్డీఓ మాధవరావు తెలిపారు. ఈ బర్డ్ వాక్ కార్యక్రమంలో దాదాపు 75 మంది పక్షి ప్రేమికులు పాల్గొన్నారు. వారికి అన్ని రకాల సదుపాయాలు కల్పించామన్నారు.

కేంద్రం నిధులను దోచుకుంటున్న కేసీఆర్

- సర్పంచుల మరణాలకు టీఆర్ఎస్ ప్రభుత్వమే కారణం
- ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపురావు

నవతెలంగాణ-జన్నారం



గ్రామాల అభివృద్ధికి కేంద్రం నుంచి వచ్చే నిధులను సర్పంచ్ల ఖాతాలో వేయకుండా రాష్ట్ర ప్రభుత్వం తన ఖాతాకు మళ్లించుకొని గ్రామాల అభివృద్ధి కుంటుపడే విధంగా టీఆర్ఎస్ ప్రభుత్వం చేస్తోందని ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావు అన్నారు. ఆదివారం మండలంలోని దేవునిగూడా, కవ్వాల్ గ్రామాల్లో శివాజీ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు ఏర్పాటు చేసిన శివాజీ విగ్రహాలను ఎంపీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం పేద మధ్యతరగతి ప్రజలను నట్టేట ముంచుతోందన్నారు. మద్యం ధరలు విపరీతంగా పెంచి పేద ప్రజల రక్తాన్ని తాగుతోందన్నారు. కేంద్రం పేద ప్రజలకు అందిస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రజలకు అందే విధంగా టీజేపీ ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ ఖానాపూర్ నియోజకవర్గ నాయకులు అజ్మీర హరినాయక్, పెంబి జడ్పీటీసీ జాను భాయ్, బీజేపీ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు, వీరబెల్లి రఘునాథ్, మండల అధ్యక్షుడు గోలి చందు, ధర్మారం సర్పంచ్ దుర్గం గంగాధర్, తమ్మినేడి శ్రీనివాస్, కలిరాం పాల్గొన్నారు.

21న సేవాలాల్ జయంతిని విజయవంతం చేయాలి

నవతెలంగాణ-కెరమెరి

సేవాలాల్ 284 జయంతి వేడుకలను ఈ నెల21న నిర్వహిస్తున్నట్టు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రాథోడ్ రూప్‌లాల్ నాయక్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో విలేకరులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. లంబాడాల ఆధ్యాత్మిక గురువు ప్రేంసింగ్ మహారాజ్ ముఖ్యాతిథిగా పాల్గొననున్నట్లు తెలిపారు. లంబాడాల సంస్కృతి, సంప్రదాయ కార్యక్రమాలతో పాటు బోగ్ బండార్ పూజ కార్యక్రమం ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. జిల్లాలోని తండా నాయక్‌లు, ప్రజా ప్రతినిధులు, కారోబారి, ప్రజలు అధికారులు తరలి వచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సేవాలాల్ సేన నియోజకవర్గ ఇన్‌చార్జి బాధవత్ శివాజీ, సుభాష్, గంగారాం, సక్‌లాల్ పాల్గొన్నారు.

అనుదినం జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్

సోమవారం 20 ఫిబ్రవరి 2023

శివాజీ విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ

నవతెలంగాణ-నిర్మల్

ఛత్రపతి శివాజీ జయంతి సందర్భంగా ఆదివారం బాగులవాడలో శివాజీ విగ్రహ ఏర్పాటుకు భూమి పూజను విగ్రహ దాత, స్థానిక కౌన్సిలర్ అయ్యన్నగారి రాజేందర్ చేశారు. శివాజీ ధైర్య సాహసాలను కొనియాడారు. యువత ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో చిట్యాల వంశీ, చోటు, సుబ్బు, స్వాప్నిల్, నిఖిల్, కుర్మా రాజు, నారాయణ, ప్రవీణ్, అడప నవీన్, శ్రీకాంత్, అల్లం భాస్కర్, అయిట్ల ప్రవీణ్, హిందువాహిని నాయకులు, వార్డు సభ్యులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

సిరికొండ : శివాజీ జయంతిని పురస్కరించుకొని ఆదివారం సొంపల్లి గ్రామంలో శివాజీ విగ్రహ ప్రతిష్టాపనకు గ్రామస్తులు భూమి పూజ చేశారు. నేటి యువత ఆయనను ఆదర్శంగా తీసుకొని ముందుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కదం సూర్యకాంత్, అమూల్, గణేష్, పండిత్, ఈశ్వర్, రాము, నాందేవ్, జ్ఞానేశ్వర్, సచిన్ పాల్గొన్నారు.

ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి

నవతెలంగాణ-వాంకిడి

మండలకేంద్రంలో ఆదివారం ఛత్రపతి శివాజీ మహారాజ్ 393వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరె సంఘం ఆధ్వర్యంలో భాజాభజంత్రీలతో పాటు మంగళ హారతులతో మహిళలు ఛత్రపతి శివాజీ మహారాజ్‌కు ఘనంగా నివాళ్లు అర్పించారు. అనంతరం ఆరె సంఘం అధ్యక్షుడు పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ విమలాబాయి, జడ్పీటీసీ అజయ్‌కుమార్, సర్పంచ్ బండె తుకారాం, సింగిల్‌విండో చైర్మన్ జాబిరె పెంటు, భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్షుడు మౌల్కార్ అశోక్, సంఘం నాయకుడు మన్నె బాలేష్ పాల్గొన్నారు.

సిర్పూర్(టి) : ఛత్రపతి శివాజీని బహుజనులందరు ఆదర్శంగా తీసుకొని ఆయన అడుగుజాడల్లో నడవాలని ఆరె సంఘం మండల అధ్యక్షుడు చంకపూరి శంకర్ అన్నారు. ఆదివారం ఆరె సంఘం ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ 393వ జయంతిని మండంలోని డోర్‌పెల్లి, పారిగాం, సిర్పూర్ మండలకేంద్రంలో జండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఛత్రపతి శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసిన నివాళులర్పించారు. కార్యక్రమంలో డోర్‌పెల్లి సర్పంచ్ మంగక్క, దుర్గం రజినీకాంత్, ఆరె సంఘం మండల గౌరవధ్యక్షుడు ఎలుములె శంకర్, ఉపాధ్యక్షుడు మోహన్, శ్యాంరావు పాల్గొన్నారు.

వేమనపల్లి : ఛత్రపతి శివాజీ మహారాజ్ 393వ జయంతి సందర్భంగా ఆదివారం వేమనపల్లి మండల కేంద్రంతో పాటు సుంపుటం, జాజులపేట, ముల్కలపేట గ్రామాలలో వేడుకలు ఘనంగా నిర్వహించి, పెద్ద ఎత్తున ర్యాలీతీసారు. ముఖ్య అతిధిగా విచ్చేసి వేమనపల్లి మండల బీఆర్ఎస్ అధ్యక్షులు కోళి వేణుమాధవ్ రావు జండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో బెల్లంపల్లి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ లింగ గౌడ్, సర్పంచ్ కుబిడే మధుకర్, మాజీ ఎంపీపీ కుర్రు వెంకటేశం, మాజీ సర్పంచులు కుబిడే వెంకటేష్, రుద్రభట్ల లక్ష్మీ నారాయణ పాల్గొన్నారు.

కౌటాల : శివాజీ జయంతి వేడుకలను మండల కేంద్రంతో పాటు మండలం లోని అన్ని గ్రామాలలో ఆరె కులస్తులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని ఆరె సంక్షేమ సంఘం భవన ప్రాంగణంలో ఆరె సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు దనోర్కార్ వసంతరావు జెండా ఆవిష్కరించారు.


ఆసిఫాబాద్‌లో..

కాగజ్‌నగర్ : కాగజ్‌నగర్‌లోని శివాజీ చౌక్‌లో ఆదివారం ఛత్రపతి శివాజీ 393వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలలో ఆర్ఎస్ఎస్ కరీంనగర్ విభాగ్ సేవా ప్రముఖ్ మాధవరం రంగస్వామి జెండాను ఆవిష్కరించారు. దీనికి ముందు శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు, కొంగ సత్యనారాయణ, భజరంగ్‌దళ్ జిల్లా కన్వీనర్ శివగౌడ్‌తో పాటు హిందూ ఉత్సవ సమితి అధ్యక్షులు సిందం శ్రీనివాస్, కోశాధికారి లెక్కల మురళీకృష్ణ, హిందూ వాహిని అధ్యక్షులు పోలోజు శ్రీనివాస్ పాల్గొన్నారు.

బెజ్జూర్ : మండలకేంద్రంలో ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలను ఆదివారం ఆరెకుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆరెకుల సంక్షేమ సంఘం జెండాను సంఘం అధ్యక్షుడు బుజాడి సత్తయ్య ఆవిష్కరించారు. కార్యక్రమంలో పాపన్‌పేట సర్పంచ్ బుజాడి శేఖర్, యూత్ అధ్యక్షుడు డోకె మహేష్ పాల్గొన్నారు.

రెబ్బెన : మండలకేంద్రంలోని ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ జుమ్డి సౌందర్య ఆనంద్, జడ్పీటీసీ వేముర్ల సంతోష్ శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం మండలంలోని ఆరె కులస్తులందరికి శివాజీ జయంతి శుభాకాంక్షలు తెలియజేశారు. కర్యక్రమంలో సర్పంచ్‌లు కోలె శ్యాంరావు, దోబె విలాస్, పిప్రె బాలకిషన్, చౌదరి దుర్గాదాస్ పాల్గొన్నారు.

జైనూర్ : పోరాట యోధుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ జీవితాన్ని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని జిల్లా జడ్పీ చైర్‌పర్సన్ కోవలక్ష్మి అన్నారు. ఆదివారం మండలకేంద్రంలోని శివాజీ చౌక్ వద్ద ఛత్రపతి శివాజీ విగ్రహానికి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కనక యాదవరావు, తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు కొట్నాక విజయ్, స్థానిక సర్పంచ్ మెస్రం పార్వతి లక్ష్మణ్ పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు.

పెంచికల్‌పేట్ : మండలంలో ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలను ఆరె సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జెండాలను ఆవిష్కరించారు. మండలకేంద్రంలో డీజే సౌండ్‌తో ద్విచక్ర వాహనాల ర్యాలీ నిర్వహించారు. ఎల్లూరు గ్రామంలో ఆరె సంక్షేమ సంఘం తాలుకా అధ్యక్షుడు చపిడె సత్యనారాయణ, ఆరె సంఘం మండలాధ్యక్షుడు డోకె మహేష్ ఆధ్వర్యంలో జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

చింతలమానపల్లి : మండల కేంద్రంలో పాటు వివిధ గ్రామాలలో ఆదివారం చత్రపతి శివాజీ 393వ జయంతి ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలో ఆరెకుల సంక్షేమ సంఘం, ఆరె యువసేన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో చత్రపతి శివాజీ మహారాజ్ జయంతిని భాజా భజంత్రీలతో, జై శివాజీ, జై భవాని అను నినాదాలతో ఊరేగించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీపీ డుబ్బుల నానయ్యా, జడ్పీటీసీ డుబ్బుల శ్రీదేవి వెంకన్న పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆరెకుల సంక్షేమ సంఘం మండల గౌరవ అధ్యక్షులు భీకర నారాయణ, ఉపాధ్యక్షులు డోకే శీను, ప్రధాన కార్యదర్శి చౌదరి చందు, ఆరే యువసేన మండల అధ్యక్షులు డుబ్బుల మహేష్, ప్రధాన కార్యదర్శి సత్పుతే తిరుపతి, ఆరెకుల నాయకులు సున్కరి మహేష్, శ్రీమన్నారాయణ, టోంబ్రే మారుతి పాల్గొన్నారు.

ఆసిఫాబాద్ : ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతిని ఆరె సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఎమ్మెల్యే ఆత్రం సక్కు, జడ్పీటీసీ అరిగెల నాగేశ్వరరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆరె సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు జైరామ్‌తో కలిసి ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. అదేవిధంగా బీజేపీ నాయకుడు హరీష్ బాబు, విశాల్, సతీష్ బాబు, పీసీసీ సభ్యురాలు సరస్వతి, ఎమ్మార్పీఎస్ నాయకుడు రేగుంట కేశవ్, బీసీ సంక్షేమ సంఘం నాయకుడు రమేష్ శివాజీ విగ్రహానికి నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో ఆరె సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బిక్కాజి, సింగిల్విండో చైర్మన్ అలీ బిన్ అహ్మద్, మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ గాదవేని మల్లేష్, ఆరె సంక్షేమ సంఘం జిల్లా నాయకులు నాగయ్య, మారుతి, సంతోష్ పాల్గొన్నారు.


జైనూర్‌లో..


కాగజ్‌నగర్‌లో..


పెంచికల్‌పేట్‌లో..


రెబ్బెనలో..

సంతలో పిచ్చి కుక్కల స్వైర విహారం



నవతెలంగాణ-లక్షెట్టిపేట్

పట్టణంలో ప్రతి ఆదివారం నిర్వహించే వార సంతలో పిచ్చి కుక్కలు స్వైర విహారం చేశాయి. 11 మందిని గాయపరిచినట్లు ప్రభుత్వ వైద్యాధికారి పవిత్ర తెలిపారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక పాత బస్ స్టాండ్ ఏరియాలో పాదచారులపై ఒక్కసారిగా దాడి చేయడంతో జనాలు భయాందోళనకు గురయ్యారు. వీరిలో తీవ్ర గాయాలైనటువంటి 9 మందిని మెరుగైన చికిత్స కోసం మంచిర్యాల జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ముగ్గురికి వాక్సిన్ వేసి చికిత్స అందించారు. మున్సిపాలిటీలో గత కొన్ని రోజులుగా పిచ్చి కుక్కలు స్వైర విహారం చేస్తూ పగలు, రాత్రి ప్రజలను భయాందోళనకు గురి చేస్తున్నప్పటికీ పాలక వర్గం చర్యలు చేపట్టడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. అంతే కాకుండా కొన్ని ఏరియాల్లో పిచ్చి కుక్కల చర్మం ఊడిపోయి పుండ్లు ఏర్పడిన కూడా వాటిని మున్సిపాల్ అధికారలు చూసి చూడనట్లు వ్యవహారిస్తుండటంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అంతర్జాతీయ స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలకు చెందిన విద్యార్థులు పిడుగు విక్రమ్, చాపిడి అజయ్ అంతర్జాతీయ స్థాయి అండర్ ఆర్మ్ క్రికెట్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ తెలిపారు. డిసెంబర్ 22 నుండి 24 వరకు పంజాబ్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి ఎంపిక పోటీల్లో అండర్ 14 విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విక్రమ్ అజయ్, ఈ నెల 22 నుండి 24 వరకు నేపాల్‌లోని పొఖ్రాలో జరగనున్న 4వ ఇండో-నేపాల్ అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విక్రమ్, అజయ్‌ను ప్రిన్సిపాల్ తో పాటు, వ్యాయామ ఉపాధ్యాయుడు బి.తిరుపతి, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ ప్రేమ్ కుమార్ ఉపాధ్యాయులు అభినందించారు.

పార్టీ బలోపేతానికి అందరూ కృషి చేయాలి

నవతెలంగాణ-ఉట్నూర్

బీజేపీ బలోపేతానికి అందరూ కృషి చేయాలని మాజీ ఎంపీ రాథోడ్ రమేష్ అన్నారు. శక్తి కేంద్రాల స్థాయి స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లో భాగంగా ఆదివారం ఉట్నూర్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎంపీ హాజరై జెండాను ఆవిష్కరించారు. అనంతరం పట్టణంలోని 71, 72, 73 పోలింగ్ బూత్‌లలో శక్తి కేంద్రం స్థాయి కార్నర్ సభ్యులతో సమావేశాన్ని ఉద్దేశించి మాట్లాడారు. బూత్‌ల పరిధిలోని సభ్యులు ఇంటింటికెళ్లి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల గురుంచి వివరించాలన్నారు. అలాగే గత ఎన్నికల్లో రాష్ట్ర ప్రభుత్వం ఏజెన్సీలోని ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించిన విషయం కూడా తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు కొలిపాక శేఖర్, శక్తి కేంద్రం అధ్యక్షులు సాడిగే రాజేశ్వర్, జిల్లా కార్యదర్శి కొండేరి రమేష్, యువమోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి రామగిరి వాసు, జిల్లా మహిళా నాయకురాలు భాగ్యలక్ష్మి, పట్టణ అధ్యక్షులు పులి శ్రీకాంత్, బూత్ అధ్యక్షులు లక్కాకుల భూపతి, ఎస్. సాయి కృష్ణ, సాడిగే రామకృష్ణ పాల్గొన్నారు.

దిలావర్‌పూర్ : మండలంలోని సిర్గాపూర్ శక్తి కేంద్రంలో ప్రజా గోస-బీజేపీ భరోసా కార్యక్రమం నిర్వహించారు. శక్తి కేంద్ర ఇన్‌చార్జి హరీష్ ఆధ్వర్యంలో బూత్ అధ్యక్షులు బ్రహ్మయ్య, హరీష్, భోజన్న అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. సమావేశంలో ముఖ్య అతిథిగా బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సామ రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రతి గడపకు చేరేవిధంగా, రానున్న ఎన్నికలలో అధికారంలోకి వచ్చే విధంగా తోడ్పడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు పిసారి శైలేశ్వర్, దళిత మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు ఉంగరాల రాజు, బీజేవైఎం జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ రాథోడ్ సందీప్ పాల్గొన్నారు.

బసవేశ్వర అలయాన్ని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి

నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలోని యాకర్‌పల్లి గ్రామంలో గల బసవేశ్వర ఆలయాన్ని ఆదివారం మాజీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి దర్శించుకున్నారు. ఆలయ పూజారి మృత్యుంజయ శర్మ ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. మహేశ్వర్‌రెడ్డిని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చిదగు రాజేశ్వర్‌రెడ్డి, వీడీసీ చైర్మన్ కల్లూరి సుదర్శన్, ఉప సర్పంచ్ సాయిందర్, కుంటోల్ల శ్రీకాంత్, చిన్నోల్ల లక్ష్మారెడ్డి, వడ్లకొండ నవీన్, మేకల చంద్రశేఖర్, గణేష్ పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో విద్యార్థి మృతి

నవతెలంగాణ-ఖానాపూర్‌రూరల్

సుభాష్‌నగర్ కాలనీకి చెందిన నాల్గో తరగతి విద్యార్థి ముద్దం ఈశ్వర్(12) బాల్ ఆడుతూ ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ గురై మృతి చెందాడు. సిఐ అజయ్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం..ఆదివారం అన్నదమ్ములు ఇద్దరు ఆరు బయట రబ్బర్ బాల్‌తో ఆడుతుండగా పక్కన ఇంటిలోని చిక్కుడు తీగల్లో పడింది. బాల్ కోసం వెళ్లిన విద్యార్థి అక్కడ ఉన్న విద్యుత్ తీగకు ప్రమాదవశాత్తు తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. తండ్రి రాము ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ వెల్లడించారు. విద్యార్థి మృతితో కాలనీలో విషాదఛాయలు అలుముకున్నాయి.

'పానమంటివే పిల్ల' ప్రోమో విడుదల

నవతెలంగాణ-అదిలాబాద్ అర్బన్

ప్రముఖ నృత్య కళాకారుడు మేకల సత్య స్వీయ రూపకల్పనలో రూపొందించిన పానమంటివే పిల్ల ప్రోమో సిడిని ఎమ్మెల్యే జోగు రామన్న ఆవిష్కరించారు. ఆదివారం డిసిసిబి కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రోమో విడుదల కార్యక్రమంలో ఆయన పాల్గొని కొరియోగ్రాఫర్ అండ్ డైరెక్టర్ సత్య మేకల నటించిన గీతాన్ని ఎస్‌డిఎఫ్ మ్యూజిక్ ఛానల్ ద్వారా యూట్యూబ్‌లో బటన్ నొక్కి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్య డ్యాన్స్ ఫ్యాక్టరీ ద్వారా మరెన్నో అద్భుత ఆవిష్కరణలు రూపొందించబడాలని ఆకాంక్షించారు. కళాకారులకు తమ ప్రభుత్వం ఎప్పుడు అండగా ఉంటుందని తమ కళలతో జిల్లాకు మంచి గుర్తింపు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ భోజారెడ్డి, సత్య డాన్స్ ఫ్యాక్టరీ నృత్య విద్యార్థులు కృష్ణ, గణేష్, శ్రీకాంత్, అభి, మహేష్, ప్రవీణ్ పాల్గొన్నారు.

జన సంద్రంగా వేలాల

నవతెలంగాణ-జైపూర్

ఎటు చూసినా భక్త జనం. శివనామస్మరణ శివసత్తుల కోలాహాలం భారీగా తరలివచ్చిన భక్తులతో వేలాల గ్రామం జన సంద్రంగా మారింది. కుటుంబ సభ్యులతో తరలివచ్చిన భక్తులు వేలాల మల్లికార్జున స్వామి ఆలయ పరిసరాలు, సమీప పంట పొలాల్లో విడిది చేశారు. ఆదివారం ఉదయం నుండి మల్లిఖార్జునస్వామి దర్శనార్థం భక్తులు బారులు తీరారు. శనివారం గట్టుమల్లన్న స్వామిని దర్శించుకున్న భక్తులు ఆదివారం వేలాల గుడిలో కొలువుదీరన మల్లిఖార్జునస్వామి చెంతకు చేరుకున్నారు. సామూహిక పట్నాలు, నిండు బోనాలతో మల్లన్నకు మొక్కులు చెల్లించుకున్నారు. గత సంవత్సరంతో పోల్చి చూస్తే ఈ ఏడాది భక్తులు భారీ సంఖ్యలో వచ్చినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. తెలంగాణా ప్రాంతానికి చెందిన వారితో పాటు వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు జాతరను సంధర్శించారు. దూర ప్రాంతాలకు చెందిన భక్తులు ఒక్క రోజు ముందుగానే వచ్చి వేలాలో విడిది చేశారు. పుష్కరఘాట్ వద్ద తాత్కాలికంగా స్నానాల గదులు ఏర్పాటు చేయడంతో పాటు పైప్‌లైన్ ద్వార భక్తుల స్నానాల కోసం గోదావరి నీటిని సరఫరా చేశారు. ఎంపీడీఓ సత్యనారాయణ, ఎంపీఓ అనిల్ కుమార్‌లు నిరంతరాయంగా పారిశుధ్య పనులు చేపట్టారు. పోలీసులు భారీ బందో బస్తును నిర్వహించారు.

కొనసాగుతున్న ఇంటర్మీడియట్ ప్రయోగ పరీక్షలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు ప్రారంభమైన ప్రయోగ పరీక్షలు నాలుగో రోజు ఆదివారం కొనసాగాయి. జిల్లా నోడల్ అధికారి శ్రీధర్ సుమన్ జిల్లాలోని పలు కళాశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 12 కేంద్రాల్లో రెండు పూటలా నిర్వహించిన ప్రయోగ పరీక్షలు జనరల్, ఒకేషనల్ కోర్సులకు గాను పకడ్బందీగా నిర్వహించబడ్డాయని తెలిపారు. డీఈసీ బృందం కాగజ్‌నగర్, ఆసిఫాబాద్ లోని పలు పరీక్షా కేంద్రాలను సందర్శించి పరీక్షలకు సంబంధించిన రిపోర్టులు, సమాధాన పత్రాల కవర్లు, రికార్డులు, ప్రశ్నాపత్రాలను క్షుణ్ణంగా పరిశీలించారని తెలిపారు. పరీక్షా నిర్వాహకులకు పలు సూచనలు చేసారు. జిల్లా వ్యాప్తంగా ఉదయం మొత్తం 693 మంది విద్యార్థులకు గాను 663 మంది హాజరయ్యారు. 30 మంది గైర్హాజరయ్యారని, మధ్యాహ్నం మొత్తం 442 మంది విద్యార్థులకు గాను 424 మంది హాజరయ్యారని, 18మంది గైర్హాజరయ్యారని అన్నారు. ఈ పరీక్షల పర్యవేక్షణలో జిల్లా పరీక్షల కమిటీ సభ్యులు నైతం శంకర్, తిరుపతి నిర్వాహక సిబ్బంది పాల్గొన్నారు.

సందీప్‌నగర్ శివాలయంలో అన్నదానం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని సందీప్ నగర్ శివాలయంలో ఆదివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మహాశివరాత్రి మరుసటి రోజు ఆలయంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. దీనిలో భాగంగా అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. అన్నదాన కార్యక్రమానికి సహకరించిన స్థానికంగా జిలేబి బండి నిర్వహిస్తున్న రాజస్థాన్‌లోని జోధ్‌పూర్‌కు చెందిన పూరారంను శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సందీప్ నగర్ శివాలయం ఆలయ కమిటీ సభ్యులు రాపర్తి కార్తిక్, వెంకటేశ్వర్లు, రాపర్తి సతీష్, విజయ్, నారాయణ, సతీష్, సాయి, అశోక్, మల్లేష్, దయాసాగర్, శ్రావణ్, ప్రశాంత్, నరసింహ, మధునయ్య, భక్తులు, మహిళలు పాల్గొన్నారు.

23న విద్యాసంస్థలకు సెలవు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఈ నెల 23న జిల్లా కేంద్రంలోని రామ్ లీలా మైదానంలో సంత్ సేవాలాల్ మహారాజ్ అధికార జయంతి వేడుకలను నిర్వహించనున్నారు. దీనికిగాను గురువారం ప్రభుత్వ ప్రైవేట్ విద్యా సంస్థలకు సెలవును ప్రకటిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మార్చి రెండో శనివారం పని దినంగా ప్రకటిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇంటర్మీడియట్ కాలేజీలకు ప్రాక్టికల్ పరీక్షల దృష్ట్యా ఈ సెలవు వర్తించదని స్పష్టం చేశారు.

కన్నులపండువగా సామూహిక వివాహాలు

నవతెలంగాణ-జైనూర్

సిర్పూర్(యూ) మండలంలోని మహాగాం గ్రామంలోని పురోజీబాబా ఆశ్రమంలో సామూహిక వివాహాలు కన్నులపండువగా నిర్వహించారు. ఆదివాసీ సంస్కృతి సాంప్రదాయాలతో 8 మంది జంటలకు వివాహం చేశారు. ఈ కార్యక్రమానికి జడ్పీ చైర్‌పర్సన్ కోవలక్ష్మి, ఎమ్మెల్యే ఆత్రం సక్కు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఏట సామూహిక వివాహాలు నిర్వహిస్తారని, ఇప్పటివరకు సుమారు 500 జంటలకు వివాహాలు నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. పేదింటి ఆడపడుచుకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుందని, ఇతర ప్రాంతాలకు చెందిన గిరిజనులకు కూడా వివాహం చేయటం గొప్పవిషయం అన్నారు. వివాహం చేసుకున్న నూతన వధువరులకు నాయకులు పెండ్లి కానుకలను అందజేశారు. బంగారు మంగళ సూత్రాలు, మెట్టెలు, వస్త్రాలను, వంట సామగ్రి ఉచితంగా ఇవ్వటం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కనక యాదవరావు, పురోజీబాబా మఠాధిపతి మెస్రం కైలాశ్ మహారాజ్, కమిటి అధ్యక్షుడు కొట్నాక పాండురంగ్, మెస్రం భూపతి మహారాజ్, కిశన్ మహారాజ్, భీంరావు, మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు తొడసం భాగ్యలక్ష్మి, వైస్ ఎంపీపీ ఆత్రం ప్రకాష్, కెరమెరి జడ్పీటీసీ సెడ్మకి ధృపతాబాయి, సర్పంచ్ ఆత్రం పద్మ రాజేశ్వర్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు తొడసం ధర్మారావు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆత్రం భగవంత్‌రావు, ఏటీడీఏ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆత్రం చొక్కారావు, సర్పంచ్‌లు మెస్రం భూపతి, వీనాబాయి పాల్గొన్నారు.



రైతులకు న్యాయం చేయాలని రిలే నిరాహార దీక్షలు



నవతెలంగాణ-నస్పూర్

మున్సిపాలిటీ పరిధిలోని 42వ సర్వే నెంబర్‌లో భూమిని కోల్పోయిన పలు దళిత రైతులు తమ కుటుంబ సభ్యులతో న్యాయం చేయాలని గత ఐదు రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్నారు. ఐదవ రోజు ఆదివారం దళిత రైతులకు మద్దతుగా దళిత నాయకులు దీక్షలో పాల్గొని మాట్లాడారు. గత 40 ఏళ్లుగా దళిత రైతులు సాగు చేసుకుంటున్నటువంటి భూమిని ప్రభుత్వం 12 సంవత్సరాల క్రిందట టీఎన్జీఓలకు కేటాయించినట్లు తెలిపారు. అట్టి భూమిని తమకే కావాలని కోర్టును ఆశ్రయించగా కోర్టు తీర్పు వచ్చే వరకు ఎవరు ఎలాంటి పనులు చేపట్టరాదని స్టే ఆర్డర్ ఇచ్చిందని తెలిపారు. కానీ కొందరు రియాల్టర్లు జోక్యం చేసుకొని టీఎన్జీఓలకు, దళితులకు మధ్య రాయబారాలు చేస్తూ దళితులకు భూమి దక్కకుండా చేస్తున్నారని ఆరోపించారు. ఇట్టి భూమిలో ఎలాంటి పనులు చేపట్టరాదని కోర్టు ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ కొంతమంది ఈ స్థలంలో 12 బోర్లను వేశారని వారు పేర్కొన్నారు. కోర్టు ఉత్తర్వులను దిక్కరించిన వారిపై, బోరు వేసిన యజమానిపై కోర్టు ధిక్కరణ కేసు నమోదు చేసి, బోర్లు వేసిన యంత్రాన్ని సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. తమభూమి తమకు చెందే వరకు రిలే నిరాహార దీక్షలో కొనసాగిస్తామని పేర్కొన్నారు. ఈ దీక్షలలో మాది హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షుడు రేగుంట సునీల్ మాదిగ, నస్పూర్ మాజీ సర్పంచ్ వేల్పుల రాజేష్, కొయ్యల కొమరయ్య, రమేష్, సురిమెళ్ళ శ్రీనివాస్, అట్కపురం సమ్మయ్య మాడుగుల కిరణ్, శంకర్, వెంకట్, కడారి రమేష్ పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులు సరికాదు

నవతెలంగాణ-జైనూర్

బీఆర్ఎస్ కార్యకర్తలు షెర్మిల పాదయాత్రలో రాళ్లతో దాడిచేయడం, తమ కార్యకర్తలను అక్రమంగా అరెస్టు చేయటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని వైఎస్ఆర్‌టీపీ జిల్లా అధ్యక్షుడు బుక్య గోవింద్ నాయక్ అన్నారు. ఆదివారం లింగాపూర్ మండలకేంద్రంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ సాధించినప్పటీ నుండి ప్రభుత్వం అవినీతి అక్రమాలకు పాల్పడుతుందని ప్రశ్నించే వారిని అరెస్టు చేయడం ఎక్కడి న్యాయమని ప్రశ్నించారు. మహబూబ్‌నగర్ జిల్లాలో గత మూడు రోజులుగా వైఎస్ఆర్ షెర్మిల పాదయాత్ర చేస్తున్న సందర్భంలో ప్రజలను కలుస్తూ వారి సమస్యలను వింటూ బహిరంగ సభ నిర్వహిస్తే వారిని విమర్శించడం సరైందికాదన్నారు. షెర్మిలమ్మ క్యాంపుపై రాళ్ల దాడిచేయడం, ఫ్లెక్సీలు చించివేయడం తీవ్రంగా ఖండిస్తున్నట్టు పేర్కొన్నారు. షెర్మిల పాదయాత్రలో అక్రమంగా అరెస్టు చేసి ఆమెపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదుచేయడం సిగ్గుచేటన్నారు. వెంటనే ఆమెపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ యూత్ అధ్యక్షుడు ఆనంద్ ఈశ్వర్, ఎస్‌సీ సెల్ అధ్యక్షుడు నాగోరావు, ప్రచార కమిటీ అధ్యక్షుడు జిల్లా జాదవ్ అల్లాసింగ్, ఎస్‌సీ సెల్ జిల్లా అధ్యక్షుడు నారాయణ, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు షేక్ అతిక్, లింగాపూర్ మండలాధ్యక్షుడు బానోత్ గోవింద్ పాల్గొన్నారు.

